PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 90 | విజయవాడ, మంగళవారం 31 అక్టోబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 31 October 2023 | Rs



కర్నూలు జిల్లా ఆదోనిలో ప్రజారక్షణభేరి బస్సు యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ ధావలే

బిజెపి విషకౌగిలి వీడండి



కురుపాం బహిరంగ సభలో మాట్లాడుతున్న బివి రాఘవులు, వేదికపై వి శ్రీనివాసరావు, దడాల సుబ్బారావు తదితరులు

వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు సిపిఎం సూచన

సీతంపేట, ఆదోనిల్లో ప్రజారక్షణ భేరి బస్సు యాత్రలు ప్రారంభం

బిజెపితో బంధం వినాశకరమని, ఆ పార్టీ విషకౌగిలి నుంచి వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బయటకు రావాలని సిపిఎం నాయకులు కోరారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణ భేరిలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, కర్నూలు జిల్లా ఆదోనిలో సోమవారం బస్సు యాత్రలు ప్రారంభయ్యాయి. బస్సు యాత్రలను ఆదోనిలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, సీతంపేటలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ జెండా ఊపి ప్రారంభించారు. ఆదోనిలో ప్రారంభమైన యాత్ర తొలి రోజు కర్నూలు వరకూ సాగింది. సీతంపేటలో ప్రారంభమైన యాత్ర పాలకొండ, కురుపాం మీదుగా పార్వతీపురం చేరుకుంది. దీనికి అనుబంధంగా ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. బస్సు యాత్రకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది.

- వార్త 2లో

బాధితులకు అండగా ఉంటాం

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి
- రైలు ప్రమాద క్షతగాత్రులకు విజయనగరం సర్వజనాసుపత్రిలో పరామర్శ
- పూర్తిగా కోలుకొనేవరకు వైద్య సహాయమందిస్తామని భరోసా

ప్రజాశక్తి- విజయనగరం టౌన్, కోట

రైలు ప్రమాద బాధితులకు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని, అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి భరోసా ఇచ్చారు. విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కంటకాపల్లి రైలు ప్రమాద బాధితులను సోమవారం ఆయన పరామర్శించారు. ఆస్పత్రి వార్డుల్లో మొత్తం 29 మంది క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. ప్రతి ఒక్కరి వద్దకూ వెళ్లి ఆయన పరామర్శించారు. రైలు ప్రమాదం జరిగిన తీరు, వైద్య సదుపాయంపై ఆరా తీశారు. వారిని ఓదార్చారు. పూర్తిగా కోలుకొనే వరకు వైద్య సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ వీలైనంత త్వరగా కోలుకొనే విధంగా మరింత మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని ఆదేశించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. ప్రమాద సంఘటనను వివరిస్తూ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను ముఖ్యమంత్రి తిలకించారు. ప్రమాదం జరిగిన తీరును, తీసుకున్న సహాయ చర్యలను మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా కలెక్టర్, రైల్వే ఉన్నతాధికారులు ఆయనకు వివరించారు. మధ్యాహ్నం సుమారు 1.20 గంటలకు విశాఖ నుంచి హెలికాప్టర్‌లో పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి 1.35 గంటలకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చారు. దీనికి ముందు ఆయన కంటకాపల్లి రైలు ప్రమాద స్థలాన్ని హెలికాప్టర్ నుంచి వీక్షించారు. ఆస్పత్రిలో దాదాపు గంటన్నర సమయం క్షతగాత్రులను, మృతుల బంధువులను పరామర్శించి, వైద్య సహాయంపై సమీక్షించిన అనంతరం సుమారు 3.35 గంటలకు తిరుగు పయనమయ్యారు. ముఖ్యమంత్రి వెంట డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, వైసిపి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఉన్నారు.



సర్వజన ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

13కి చేరిన మృతుల సంఖ్య

- సిగ్నల్ వ్యవస్థ వైఫల్యం వల్లే ప్రమాదం
- ముమ్మరంగా సహాయక చర్యలు
- 19 గంటల్లో ట్రాక్ పునరుద్ధరణ

లోపలి పేజీలో..

ఒపిఎస్ కోసం 3న ఢిల్లీలో ధర్నా

ఫార్మా కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

- రేపటి నుంచి రిజిస్ట్రేషన్

చంద్రబాబుపై మరో కేసు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

ఎపి స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ కేసులో ఇప్పటికే అరెస్టు అయి జ్యుడీషియల్ రిమాండ్‌లో వున్న మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుపై ఎపి సిఐడి మరో కేసు నమోదు చేసింది. గత ప్రభుత్వ హయాంలో మద్యం కంపెనీలకు అక్రమంగా అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలతో అవినీతి నిరోధక చట్టం కింద ఈ కేసు నమోదైందని ఎసిబి కోర్టుకు సోమవారం సిఐడి పిటిషన్ ద్వారా తెలిపింది. మద్యం కంపెనీలకు అక్రమ అనుమతుల కేసులో చంద్రబాబు ఎ3గా వున్నారని పేర్కొంది. ఈ కేసులో అప్పటి ఎక్సైజ్‌శాఖ కమిషనరు ఐఎస్ నరేష్‌ను ఎ1గా, మాజీ ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రను ఎ2గా, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఎ3గా చేరుస్తూ సిఐడి కేసు నమోదు చేసింది. ఈ మేరకు విజయవాడలోని ఎసిబి కోర్టులో పిటి వారెంటును సిఐడి వేయగా, కోర్టు విచారణకు అనుమతించింది. స్కిల్ డెవలప్‌మెంటు కేసులో రిమాండ్‌లో చంద్రబాబుపై ఇప్పటికే ఇన్నర్‌రింగ్ రోడ్డుకు సంబంధించి వారెంట్ పిటిషన్ పెండింగ్‌లో వుండగా, ఇప్పుడు మద్యం అమ్మకాలకు సంబంధించి అక్రమాలు జరిగాయనే కేసులో పిటి వారెంట్‌ను సిఐడి దాఖలు చేసింది.



పాలస్తీనాకు పెద్దయెత్తున సంఘీభావం

- ఐరాసలో మోడీ ప్రభుత్వ వైఖరికి ఖండన
- ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలి
- 26-28 దేశవ్యాపిత కిసాన్-మజ్దూర్ మహాపడావ్‌కు మద్దతు
- డిసెంబరు 4న దళిత సంఘాల పార్లమెంట్ మార్చ్‌కు మద్దతు
- పార్టీ శాఖలకు సిపిఎం కేంద్ర కమిటీ పిలుపు

లోపలి పేజీలో..

జస్టిస్ నరేందర్ ప్రమాణ స్వీకారం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ గుహనాథన్ నరేందర్‌తో రాజ్‌భవన్‌లో గవర్నరు జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ చదవడంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ గుహనాథన్ నరేందర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. న్యాయమూర్తులతోపాటు, సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి కె రాజేంద్రనాథ్ రెడ్డి, ఎపి, కర్ణాటక హైకోర్టుల అధికారులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సిపిఎం 'ప్రజారక్షణ భేరి' జాతాలు దిగ్విజయంగా సాగాలి

- ఎంసిపిఐ(యు)

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిపిఎం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా రక్షణ భేరి జాతాలు దిగ్విజయంగా సాగాలని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం ఆకాంక్షించారు. దేశంలో బిజెపి, దాని మద్దతు పార్టీలను ఓడించాలని, సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపైన, రాష్ట్రంలోని సకల వర్గాల సమస్యలను పరిష్కరించాలని, ప్రజా ఉద్యమాలపై సాగుతున్న నియంతృత్వ-నిర్బంధ విధానాలు, అక్రమ అరెస్టులు నిలుపుదల చేయాలని సాగుతున్న ఈ జాతాలు దిగ్విజయంగా సాగి సకల వర్గాల ఆదరణ పొందాలన్నారు.

నెల్లూరు క్వార్ట్జ్ మైనింగ్‌పై 3 ప్రత్యేక బృందాలతో తనిఖీలు

- నివేదిక రాగానే చర్యలు
- మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నెల్లూరు క్వార్ట్జ్ మైనింగ్‌పై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఇప్పటికే మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని పంచాయతీరాజ్, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రత్యేక బృందాలు తనిఖీలు చేసి వారం రోజుల్లో నివేదిక సమర్పిస్తాయని, ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. అప్పటి వరకు మైనింగ్‌ను నిలిపేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం గనులశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపాలని, ఫిర్యాదులు వచ్చిన ప్రతిచోటా విజిలెన్స్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని అన్నారు. గుంటూరు జిల్లాలో లైమ్‌స్టోన్, ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల్లో గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలవరం కాలువ గట్లపై ఉన్న గ్రావెల్, కొండ ప్రాంతాల్లోని గ్రావెల్ నిల్వలను అనధికారికంగా తరలిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, గనులశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది, ఎడిఎంజి డబ్ల్యుబి చంద్రశేఖర్, గనులశాఖ జెడి రాజబాబు పాల్గొన్నారు.

టిడిపి పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని అమరావతి భూ కుంభకోణం, ఎపి ఫైబర్ నెట్ సహా గత ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో జరిగిన అవకతవకలపై సమీక్ష చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం, ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) ఏర్పాటును సవాల్ చేస్తూ టిడిపి నేతలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు కోసం జారీ చేసిన జిఒ 1411, మంత్రివర్గ ఉప సంఘ నివేదిక మేరకు దర్యాప్తునకు వీలుగా ప్రభుత్వం సిట్ ఏర్పాటు జిఒ 344ను టిడిపి నాయకులు వర్ల రామయ్య, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ వేర్వేరుగా సవాల్ చేశారు. కౌంటర్ దాఖలుకు కేంద్ర ప్రభుత్వం మరోసారి గడువు కోరింది. ఇందుకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు అనుమతినిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ పిటిషన్‌పై పిటిషనర్లు రిప్లై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను నవంబరు 16కు వాయిదా వేశారు.

డ్రైవరుపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నెల్లూరు జిల్లా కావలిలో ఆర్‌టిసి డ్రైవరుపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ డిమాండ్ చేశారు. ఈ మేరకు రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌కు, ఆ శాఖ కమిషనర్ ద్వారకా తిరుమలరావుకు సోమవారం లేఖలు రాశారు. ఈ నెల 26న బెంగళూరు, విజయవాడ వెళ్తున్న ఆర్‌టిసి బస్సుకు కావలి రోడ్డుపై అడ్డంగా ఉన్న ద్విచక్ర వాహనాన్ని అడ్డు తీయాలని హారన్ మోగించిన డ్రైవరుపై దుండగులు ఘర్షణకు దిగి దాడిచేశారని తెలిపారు. మరలా మద్దూరుపాడు వద్ద అనుచరులతో కలిసి డ్రైవరును నడిరోడ్డుపై పడేసి అమానవీయంగా దాడి చేశారని పేర్కొన్నారు. ఈ దాడిని చిత్రీకరిస్తున్న వారిపై కూడా దాడి జరిగిందని తెలిపారు. ఘటన జరిగిన రెండు రోజులకు వీడియో వైరల్ కావడంతో పోలీసులు కొందరిని అరెస్టు చేశారని పేర్కొన్నారు. మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు. ఇలాంటి చర్యలపై పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఉద్యోగులకు, ప్రజలకు రక్షణ కల్పించాలని, దుండగులను కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు.



కర్నూలు జిల్లా ఆదోని బహిరంగసభలో మాట్లాడుతున్న పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, తెలుగులో అనువాదం చేస్తున్న వి.కృష్ణయ్య



సీతంపేటలో బస్సు యాత్రను ప్రారంభిస్తూ జెండా ఊపిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ

బిజెపితో బంధం వినాశకరం

- ఆ పార్టీ విషకౌగిలి నుంచి బయటపడాలి
- వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు సిపిఎం సూచన
- సీతంపేట, ఆదోనిల్లో ప్రజారక్షణ భేరి ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం, కర్నూలు ప్రతినిధులు

బిజెపితో బంధం వినాశనకరమని, ఆ పార్టీ విషకౌగిలి నుంచి వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బయటకు రావాలని సిపిఎం నాయకులు అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణ భేరిలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, కర్నూలు జిల్లా ఆదోనిలో సోమవారం బస్సు యాత్రలు ప్రారంభయ్యాయి. ఆదోనిలో ప్రజారక్షణ భేరిని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, సీతంపేటలో ప్రచార భేరిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ జెండా ఊపి ప్రారంభించారు. ఆదోనిలో ప్రారంభమైన యాత్ర కర్నూలు వరకూ సాగింది. సీతంపేటలో ప్రారంభమైన యాత్ర పాలకొండ, కురుపాం మీదుగా పార్వతీపురం చేరుకుంది. ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, గిరిజనులు ఘనంగా స్వాగతం పలికారు.

గిరిజన చట్టాలను కాలరాస్తున్న బిజెపి వత్తాసు పలుకుతున్న వైసిపి, టిడిపి : బివి.రాఘవులు

గిరిజన చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. ఆ ప్రభుత్వానికి రాష్ట్రంలోనే వైసిపి, టిడిపి వత్తాసు పలుకుతున్నాయని విమర్శించారు. పార్వతీపురం మన్యం జిల్లా రావాడ రోడ్డు జంక్షన్, పార్వతీపురంలలో జరిగిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గిరిజనులు పోరాడి సాధించుకున్న చట్టాలను సవరించి వారిని దోపిడీ చేస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే అటవీ హక్కుల చట్టాన్ని సరిగ్గా అమలు చేయడం లేదన్నారు. చట్ట ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికీ గరిష్టంగా పది ఎకరాలు వరకు భూమి ఇవ్వాల్సి ఉన్నప్పటికీ తూతూమంత్రంగా పంపిణీ జరిగిందని విమర్శించారు. అభివృద్ధి పేరుతో కొండ కోనలను ధ్వంసం చేసి అందులో నిక్షిప్తమైన గనులను కార్పొరేట్ సంస్థలకు ధారాదాత్తం చేస్తోందన్నారు. ఇందుకోసం పీసా చట్టానికి విఘాతం కలిగిస్తోందని విమర్శించారు. మరోవైపు ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను తగినంతగా కేంద్ర ప్రభుత్వం కేటాయించట్లేదని అన్నారు. ఆరకొరగా కేటాయించిన నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం మళ్లిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు వెయ్యి గిరిజన గ్రామాలు 5వ షెడ్యూల్ పరిధిలో లేకపోవడం వల్ల ఆ ప్రాంతంలోని వారికి ఐటిడిఎ సంక్షేమ అభివృద్ధి పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన బతుకులు నాశనం చేసే ప్రతి చట్టానికి వైసిపి, టిడిపి ఎంపిలు చేతులెత్తి మరీ మద్దతు తెలియజేస్తున్నారని విమర్శించారు. వీటికి తోడు జనసేన పార్టీ కూడా బిజెపితో జతకట్టిందన్నారు. గిరిజనుల హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఈ మూడు పార్టీలూ సహాయ సహకారాలు అందిస్తున్నాయని విమర్శించారు. విశాఖలోని రుషికొండను తవ్వేసి రూ.40 కోట్లతో భవనాలు నిర్మిస్తోన్న సిఎం జగన్‌కు రాష్ట్ర అభివృద్ధి, సమస్యలు పట్టడం లేదన్నారు. మత, కుల ప్రాతిపదికన ప్రజలను విభజించాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇటీవల మణిపూర్లో చోటుచేసుకున్న పరిణామాలు దీనికి తాజా తార్కాణమన్నారు. మతోన్మాదులకు అవకాశం ఇవ్వకుండా వచ్చే ఎన్నికల్లో ప్రజా హక్కులు కాపాడే వారికి, పోరాడే శక్తులు వామపక్షాలు, సిపిఎంకు అవకాశాలు ఇవ్వాలని కోరారు. జగన్‌మోహనరెడ్డి, చంద్రబాబు అవినీతి కేసుల్లో జైలుకు వెళ్లారని, అవినీతి నిజమైతే వారు కొట్టేసిన కోట్ల రూపాయలు రాష్ట్ర అభివృద్ధికి ఎంతో ఉపయోగపడేవని అన్నారు. జైలు నుంచి బయటకు వచ్చేందుకు పోరాడుతున్న చంద్రబాబు గతంలో ప్రజల కోసం పోరాడిన వామపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేయించారని గుర్తు చేశారు. ఇప్పుడు జగన్ కూడా అదే తరహాలో ఉద్యమాలను అణచి వేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అటువంటి బెదిరింపులు అక్రమ అరెస్టులు కమ్యూనిస్టులకు కొత్త కాదన్నారు. గిరిజన యూనివర్సిటీని మంజూరు చేసినా భవనాల నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని తెలిపారు.

సాధికార యాత్ర చేపట్టే నైతిక హక్కు వైసిపికి లేదు : వి శ్రీనివాసరావు

రాష్ట్రంలో సామాజిక సాధికార యాత్ర చేపట్టే నైతిక హక్కు వైసిపి ప్రభుత్వానికి లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాల్లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అడవులు, భూములు, గనులు వంటి సహజ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో వైసిపి జతకట్టిందని విమర్శించారు. పేదలకు, దళితులకు, గిరిజనులకు ఇచ్చిన భూములను లాగేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికీ గిరిజన గ్రామాల్లో తాగునీరు, వైద్యం, విద్య వంటి మౌలిక సదుపాయాలు తగినంతగా లేవన్నారు. పేదలు, గిరిజనులు, రైతుల కోసం ఏర్పాటు చేసిన చట్టాలను కేంద్రం నీరుగారిస్తుంటే చూస్తోన్న వైసిపి... సామాజిక జపం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న టిడిపి ప్రభుత్వం కూడా మోడీ మోసకారి విధానాలకు వంతపాడుతోందని విమర్శించారు. అదానీ ప్రయోజనాల కోసమే రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, కె.సుబ్బరావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, రెడ్డి వేణు తదితరులు పాల్గొన్నారు.

బిజెపిని ఓడించి దేశాన్ని రక్షించుకోవాలి : అశోక్ ధావలే

రాబోయే ఎన్నికల్లో బిజెపిని ఓడించి దేశాన్ని రక్షించుకోవాలని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా ఆదోని ప్రజారక్షణ భేరిని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదోని, ఆలూరు, పత్తికొండ, కోడుమూరు, కర్నూలులో బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. కర్నూలు జిల్లాలో ప్రధాన పంట అయిన పత్తి గతంలో ఎకరాకు ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని, ఇప్పుడు ఒకటి, ఒకటిన్నర క్వింటాళ్లు మాత్రమే వస్తోందని, అలాంటి దుర్భర పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కరువు నివారణ చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. అత్యధిక ప్రాంతాల్లో పండే వరికి క్వింటాలుకు కేంద్రం రూ.2,100 మాత్రమే మద్దతు ధర ప్రకటించిందని, కేరళలోని వామపక్ష ప్రభుత్వం రూ.2,850 ఇస్తోందని తెలిపారు. దేశానికి, అసమానతలు లేని అభివృద్ధికి వామపక్షాలే ఏకైక ప్రత్యామ్నాయన్నారు. రాష్ట్రంలోని 679 మండలాల్లో 400కుపైగా మండలాల్లో కరువు ఉందని, వైసిపి ప్రభుత్వం ఇప్పటి వరకూ కరువు మండలాలు ప్రకటించలేదన్నారు. వెంటనే కరువు మండలాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం లేదని, కేంద్రం కూడా సాయం చేయడం లేదని అన్నారు. ప్రాజెక్టులు లేకుండా సాగెలా చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా ఘోరంగా విఫలం అయ్యారని విమర్శించారు. బిజెపితో వెళ్లే ఏ పార్టీతోనూ సిపిఎం కలిసి వెళ్లదని స్పష్టం చేశారు.

ప్రజలు చైతన్యవంతులు కావాలి : ఎంఎ గఫూర్

ప్రజలు అడగకపోతే దొంగలు కొల్లగొడుతూనే ఉంటారని, ప్రజలు చైతన్యవంతులు కావాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ అన్నారు. మాకేం ఇస్తారు. ప్రాజెక్టులు పూర్తి చేస్తారా లేదా? ఉపాధి చూపిస్తారా? లేదా? అని నాయకుల చొక్కా పట్టుకొని నిలదీయాలని కోరారు. రాష్ట్రంలో అధికారం కోసం వైసిపి, టిడిపి ఆరాటపడుతున్నాయి తప్ప, ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

రైతుల ఆత్మహత్యలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణమన్నారు. పంటలు ఎండిపోతుంటే ఆదుకోకుండా మంత్రులు, ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కమీషన్ల మీద ఉన్న ఆసక్తి రైతుల మీద లేదని విమర్శించారు. సామాజిక సాధికార యాత్రలో సాధికారత ఏముందని, ఒక్క కార్పొరేషన్‌కైనా డబ్బులు ఇచ్చారా అని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రజల కోసం త్యాగం చేసి జైలుకెళ్లారా? అని ప్రశ్నించారు. ఎపికి అన్యాయం చేసిన బిజెపికి వైసిపి, టిడిపి, జనసేన పార్టీ మద్దతు ఇస్తుండడం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేయడమేనని తెలిపారు. బిజెపితో అంటకాగే వాళ్లను చిత్తుగా ఓడించాలని కోరారు.. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఉత్పాదకతలో విప్లవాత్మక మార్పులు

- రూ.19,037 కోట్లకు ఆమోదం
- సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



పరిశ్రమల ఉత్పాదకతలో సాంకేతికంగా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన చేసుకోవడంతోపాటు ప్రపంచ పారిశ్రామిక రంగం పోకడలను అవగతం చేసుకోవాలన్నారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశం సిఎం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రూ.19,037 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. 69,565 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్స్‌లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచామన్నారు.

పరిశ్రమల ఏర్పాటు కోసం ఇచ్చే అనుమతులు, తదితర అంశాల్లో ప్రభుత్వం వేగంగా స్పందిస్తుందన్నారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల అమలు విషయంలో మరింత వేగం పెంచాలన్నారు. ఎంఎస్‌ఎంఇల పట్ల చాలా సానుకూలతతో ప్రభుత్వం ముందుకు పోతోందన్నారు. ఏ సమస్య ఉన్నా ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉన్నామన్న భరోసాను వారికి కల్పిస్తున్నామని, అనుమతులు, క్లియరెన్స్ విషయంలో ఇప్పుడున్న వేగాన్ని మరింతగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమీక్షలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్‌నాథ్, ఆర్‌కె రోజా, సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి ఉన్నతాధికారులు రజత్ భార్గవ్, కె విజయానంద్, ఎస్ఎస్ రావత్, ఎన్ యువరాజ్, కె సునీత, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఐపిబి ఆమోదం పొందిన కంపెనీలు

- చిత్తూరు జిల్లా పుంగనూరులో ఎలక్ట్రిక్ బస్సుల తయారీ పరిశ్రమను పెప్పర్‌మోషన్ కంపెనీ ఏర్పాటు చేయబోతోందని, ఇందుకోసం రూ.4,640 కోట్ల పెట్టుబడితో ప్రత్యక్షంగా 8,080 మందికి ఉద్యోగాలు.
- విజయనగరం జిల్లా ఎస్‌కోటలో జెఎస్‌డబ్ల్యు ఇండస్ట్రియల్ పార్కు ప్రతిపాదనలకు అమోదం, రూ.531 కోట్ల పెట్టుబడితో 35,750 మందికి ప్రత్యక్షంగానూ, 9,375 మందికి పరోక్షంగానూ ఉద్యోగాలు.
- శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో శ్రేయాస్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ప్రతిపాదనలకు ఆమోదం. రూ.531 కోట్ల పెట్టుబడి. 35,750 మందికి ప్రత్యక్షంగానూ, 9,375 మందికి పరోక్షంగానూ ఉద్యోగాలు.
- అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లో స్మైల్ కంపెనీ ఆధ్వర్యంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్స్ తయారీ యూనిట్. రూ.166 కోట్ల పెట్టుబడి. సుమారు 5 వేల మందికి ఉద్యోగాలు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద కోస్టల్ ఆంధ్రా పవర్ లిమిటెడ్ తన పారిశ్రామిక కార్యకలాపాన్ని మార్చుకునేందుకు ఎస్ఐపిబి ఆమోదం. థర్మల్ పవర్ స్థానంలో కొత్త తరహా, సాంప్రదాయేతర పర్యావరణహిత గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ప్లాంటుకు ఎస్ఐపిబి ఆమోదం. రూ.6,174 కోట్ల పెట్టుబడి. 600 మందికి ప్రత్యక్షంగానూ, 2వేల మందికి పరోక్షంగానూ ఉద్యోగాలు.
- తూర్పుగోదావరి జిల్లా కడియం వద్ద ఆంధ్రాపేపర్ లిమిటెడ్ విస్తరణ. రూ.4వేలకోట్ల పెట్టుబడి, 3వేల మందికి ఉద్యోగాలు.
- విశాఖ జిల్లా అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లో ఎటిసి టైర్స్ లిమిటెడ్ విస్తరణ. రూ.679 కోట్ల పెట్టుబడి. 300 మందికి ఉద్యోగాలు.
- తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ విస్తరణ. రూ.933 కోట్ల పెట్టుబడి, 2,100 మందికి ఉద్యోగాలు.
- ఏలూరు జిల్లా కొమ్మూరు వద్ద రూ.114 కోట్ల పెట్టుబడి పెట్టనున్న శ్రీ వెంకటేశ్వర బయోటెక్‌కు ఆమోదం. 310 మందికి ఉద్యోగాలు.
- విశాఖ జిల్లా పద్మనాభం మండలం మద్దివద్ద రూ.50 కోట్ల పెట్టుబడి పెట్టనున్న ఓరిల్ ఫుడ్స్ లిమిటెడ్. సుమారు 550 మందికి ఉద్యోగాలు



నవంబరు 8న విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన పోస్టరును ఆవిష్కరిస్తున్న నేతలు

విశాఖ ఉక్కు పరిరక్షణకు సమరశీల పోరాటాలు

- 8న విద్యా సంస్థల బంద్
- వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం సమరశీల పోరాటాలకు విద్యార్థి, యువకులు సిద్ధం కావాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కోరారు. ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆలోచనను కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం విరమించుకోవాలని, కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ నవంబరు 8న విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టరును ఆయా సంఘాల నాయకులు విజయవాడలోని దాసరిభవన్‌లో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్నకుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి జాన్సన్ బాబు, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి రాజేష్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు, ఐసా రాష్ట్ర నాయకులు మహేష్ మాట్లాడుతూ.. అనేక పోరాటాలు, 32 మంది విద్యార్థి, యువకుల ప్రాణ త్యాగాలతో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటైందని చెప్పారు. అదానీకి అప్పగించే కుట్రలో భాగంగానే లాభాలు వచ్చే ఈ ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం కార్మికులు, ప్రజా సంఘాలు చేస్తున్న ఆందోళనలు నవంబరు 8 నాటికి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా తాము బంద్‌కు పిలుపునిచ్చామని వివరించారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి హామీ ఇచ్చారని, ఇప్పటికి నాలుగుసార్లు శంకుస్థాపన చేసినా ఆచరణలో అమలు కావడం లేదని పేర్కొన్నారు. ఇక్కడ ఫ్యాక్టరీ వస్తే రాయలసీమ జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందని చెప్పారు. రాష్ట్ర విభజన హామీల అమలులో మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా మోసం చేస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అవుతున్నా.. పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వంపై కూడా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

వ్యవసాయ ఆక్వా రంగం అతలాకుతలం

- కేరళ తరహా రుణ విముక్తి చట్టం తేవాలి : వై కేశవరావు
- వ్యవసాయ, ఆక్వారంగ రాష్ట్ర సదస్సులో 19 డిమాండ్లతో తీర్మానం

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

ఒకప్పుడు సిరులు పండించిన వ్యవసాయం, ఆక్వా రంగాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో అతలాకుతలమయ్యాయని సీనియర్ రైతు నాయకులు వై కేశవరావు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంలో స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయడంతో పాటు ప్రాసెసింగ్, మార్కెటింగ్, అమ్మకం వెసులుబాటు కల్పించినప్పుడే వ్యవసాయం, ఆక్వా రంగాలు సంక్షోభం నుంచి బయట పడతాయన్నారు. కేరళ తరహా రుణవిముక్తి చట్టం తీసుకొచ్చి రాష్ట్రంలోని రూ.15 లక్షల కోట్ల రైతుల రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతును నిలబెట్టాలి-వ్యవసాయాన్ని కాపాడాలి నినాదంతో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో రైస్‌మిల్లర్స్ హాలులో సోమవారం సిపిఎం ఆధ్వర్యాన రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి బలరాం అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రజల, రైతుల సమస్యలను ప్రభుత్వాలు గాలికొదిలేశాయన్నారు. పదవుల కోసం పార్టీలు పోటీ పడుతున్నాయని విమర్శించారు. కేశవరావు మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో 50 నుంచి 60 శాతం మంది వ్యవసాయరంగం మీద ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వ్యవసాయం తర్వాత ఆక్వా రంగం విస్తరించిందని, అదీ ఒడిదుడుకుల నడుమ సాగుతోందని తెలిపారు. వ్యవసాయరంగం బడ్జెట్ పెంచి ఆహార భద్రత కాపాడాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. రైతులు, కార్మికులు ఒకే తాటిపైకి వచ్చి సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ బిజెపి, వైసిపి, గతంలో పాలించిన టిడిపి సైతం వ్యవసాయం పట్ల సరైన విధానం అవలంభించలేదన్నారు. 400 కరువు మండలాలు ఉన్నాయని, వీటి అభివృద్ధి, స్థితిగతులపై ప్రభుత్వం కనీసం ఎటువంటి ప్రకటనా చేయలేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు ప్రవేశ పెట్టిన 19 డిమాండ్లతో కూడిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. రాబోయే రోజుల్లో రైతులు, కౌలు రైతులు, అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని రాష్ట్ర సదస్సు పిలుపునిచ్చింది. ఈ సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్, కవురు పెద్దిరాజు, రైతు నేతలు ఆకుల హరేరామ్, జుత్తిగ నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

జాతి సంపద కార్పొరేట్లపరం కానివ్వం

- 27, 28న మహాపడావ్ జయప్రదం చేయండి : నర్సింగరావు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల : స్వాతంత్ర్యానంతరం ప్రజల త్యాగాలతో నిర్మించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులు, దేశ ఆర్థిక సర్వస్వాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణను వేగవంతంగా అమలు చేస్తోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు విమర్శించారు. 'ప్రభుత్వ విధానాలు-కార్మికులపై ప్రభావం' అనే అంశంపై శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశ సంపదను అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ల పరం చేయడం ద్వారా దేశానికి, ప్రజలకు బిజెపి ద్రోహం చేస్తోందన్నారు. కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు. సిఐటియు పోరాటాల వల్ల ఇప్పటివరకూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా కాపాడుకున్నామని తెలిపారు. కార్మికుల కనీస వేతనం నెలకు రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, కనీస పెన్షన్ రూ.పది వేలు ఇవ్వాలని, విద్యుత్ సవరణ బిల్లు 2022 రద్దు చేయాలని, ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో రూ.రెండు లక్షల కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబరు 27, 28న విజయవాడలో నిర్వహించే కార్మిక, కర్షక మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సదస్సులో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎన్.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

3,220 అధ్యాపక పోస్టుల భర్తీ

- నేటి నుంచి దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 17 యూనివర్సిటీల్లో 3,220 అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేటెడ్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనుంది. ఈ పోస్టులకు అభ్యర్థులు మంగళవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చునని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె హేమచంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. నవంబరు 27 వరకు ఆన్‌లైన్ పోర్టల్ తీవషతీబట్ఎవత్ం.బఅఅజవతీంట్అవం.ఖజూ.స్త్రశీజ.అఅ ద్వారా దరఖాస్తు చేసుకుని రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. పోస్టు, కొరియర్ ద్వారా 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో అర్హత కలిగిన అభ్యర్థుల జాబితాను 30న ప్రకటిస్తామని పేర్కొన్నారు. దీనిపై అభ్యంతరాలుంటే డిసెంబరు 7లోపు గ్రీవెన్స్ ద్వారా స్వీకరిస్తామని వెల్లడించారు. స్క్రీనింగ్ టెస్టుకు అర్హత సాధించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ అభ్యర్థుల జాబితాను డిసెంబరు 8న ప్రకటిస్తామని పేర్కొన్నారు.

13కి చేరిన మృతుల సంఖ్య

- సిగ్నల్ వ్యవస్థ వైఫల్యం వల్లే ప్రమాదం
- ముమ్మరంగా సహాయక చర్యలు


ట్రాక్ పునరుద్ధరణ తరువాత నడుస్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్

ప్రజాశక్తి- జామి, విజయనగరం కోట, విశాఖ ఎంవిపి.కాలనీ అమరావతి బ్యూరో,

విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కంటకాపల్లి సమీపాన ఆదివారం జరిగిన రైలు ప్రమాదంలో మొత్తం మృతుల సంఖ్య 13కు చేరింది. గాయపడిన వారు సుమారు 39 మంది ఉన్నారని అధికారులు తెలిపారు. వీరిలో విజయనగరంలో 25 మంది, విశాఖలో 14 మంది చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. స్వల్పంగా గాయపడిన వారిని ప్రథమ చికిత్స చేసి ఇళ్లకు పంపించారు. కంటకాపల్లి-అలమండ మధ్య రైల్వే ట్రాక్‌పై ఆగి ఉన్న విశాఖ-పలాస పాసింజర్ రైలును, ఆ వెనుక వస్తున్న విశాఖ-రాయగడ పాసింజర్ రైలు ఢీకొన్న విషయం తెలిసిందే. పట్టాలు తప్పిన వీటి బోగీలు పక్క ట్రాక్‌పై ఉన్న గూడ్సు రైలు బోగీలపైకి దూసుకెళ్లడంతో పట్టాలు పైకిలేచాయి. ఈ ప్రమాదంలో తొలిరోజే పది మంది మృతదేహాలను బయటకు తీసిన సహాయక బృందాలు, సోమవారం మరో మూడు మృతదేహాలు బయటపడ్డాయి. దీంతో, మృతుల సంఖ్య 13కు చేరింది. ఛిద్రమైన రైలు బోగీలను కట్ చేసి రాయగడ పాసింజర్ రైలు లోకో పైలట్ మృతదేహంతోపాటు మరో ఇద్దరి మృతదేహాలకు బయటకు తీశారు. సంఘటనా స్థలంలో 11 మంది మృతి చెందగా, మరో ఇద్దరు ఆస్పత్రిలో మరణించారు. మృతుల్లో విజయనగరం జిల్లావాసులే ఎక్కువ మంది ఉన్నారు. పలాస రైలు గార్డు ఎం.శ్రీనివాసరావు విశాఖ రైల్వే ఆస్పత్రిలో మతి చెందగా, టెక్కలి సుగుణమ్మ విజయనగరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. మృతదేహాలను విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. క్షతగాతులకు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు.

ఇనుప చట్రాల మధ్య చిక్కుకున్న డ్రైవర్, లోకో పైలట్ మృతదేహాలు

రైలు ప్రమాదంలో బోగీలు ఛిద్రమవ్వడంతో ఇనుప ఛట్రాల మధ్య మృతదేహాలు చిక్కుకుపోయాయి. బోగీల్లో చిక్కుకున్న మృతదేహాలను వెలికి తీయడానికి సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. రాయగడ రైలు అసిస్టెంట్ డ్రైవర్ ఎస్.చిరంజీవి, లోకోపైలట్ సింగంపల్లి మధుసూదనరావు మృతదేహాలు ఇంజన్ల మధ్య చిక్కుకొని నుజ్జునుజ్జు అయ్యాయి. వారి మృతదేహాలను వెలికి తీయడానికి సహాయక బృందాలకు ఎక్కువ సమయం పట్టింది. లోకో పైలట్ శరీరం ఛిద్రం కావడంతో మాంసపు ముద్దలు బయటకు తీశారు. వీటిని గుర్తు పట్టేందుకు వీలులేని పరిస్థితి ఉంది.

ఆటో సిగ్నల్ సిస్టంలో లోపం!

గతంలో రైలు కదలాలంటే స్టేషన్ నుంచి క్లియరెన్స్ వచ్చాకే రైలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేవారు. ఒకవేళ దాని ముందు మరో రైలు వెళితే, అది తరువాత స్టేషన్ చేరుకున్నాక ఈ రైలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి వదిలే వారు. కానీ, ఆటో మోడ్ సిగ్నల్ వచ్చాక, ఒకే లైనుపై రెండు రైళ్లను ఐదు నిముషాలు వ్యవధిలోనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చి వదులుతున్నారు. పలాస రైలుకు సిగ్నల్ లోపం వలనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. కానీ, ఒఆర్ కేబుల్ కట్ అవడం వలన రైలు ఆగిపోయిందని కొందరూ చెబుతున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిగితేనే అసలు విషయం తెలియనుంది

స్థానికుల చొరవతో తగ్గిన ప్రాణ నష్టం

రైలు ప్రమాదం జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో భారీ శబ్దం రావడంతో సమీప గ్రామాలైన అలమండ, కుద్దుపాలెం, నారాయణపురం, భీమాలి గ్రామాల ప్రజలు, యువకులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులను రక్షించారు. సంఘటనా స్థలం నుంచి క్షతగాత్రులను బయటకు తీశారు. సుమారు కిలోమీటరు వరకూ భుజాలపై మోసుకొని తీసుకెళ్లి అంబులెన్సుల్లో ఎక్కించారు. వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకోవడానికి కొమ్మలు, చెట్లు తొలగించి పోలీసు, రెవెన్యూ, ఇతర సహాయక బలగాలకు సహకరించారు. ఈ నేపథ్యంలోనే కొంతమంది ప్రాణపాయం నుంచి బయటపడ్డారని బాధితులు చెబుతున్నారు. మరోవైపు మహిళలు తాగునీరు, మజ్జిక వంటివి బాధితులకు అందించి సహాయక చర్యలు చేపట్టారు.

19 గంటల్లో ట్రాక్ పునరుద్ధరణ

వాల్తేరు డివిజన్ మెయిన్ లైన్‌లోని కంటకాపల్లి - అలమండ మధ్య ఆదివారం జరిగిన రైలు ప్రమాదంలో దెబ్బతిన్న రైల్వే ట్రాక్‌ను 19 గంటల్లోనే అధికారులు పునరుద్ధరించారు. ప్రమాదం జరిగిన అరగంటలోనే సంఘటనా స్థలానికి చేరుకున్న డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. అడ్మినిస్ట్రేషన్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్‌ఫోర్స్ బృందాలు, రెస్క్యూ అంబులెన్స్‌లు, యాక్సిడెంట్ రిలీఫ్ రైళ్లను, వైద్య బృందాలను సంఘటనా స్థలానికి తరలించారు. ట్రాక్ పునరుద్ధరణ పనుల్లో భాగంగా దెబ్బతిన్న కోచ్‌లను తొలగించారు. పునరుద్ధరణ చర్యలను ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ, సీనియర్ అధికారులు పర్యవేక్షించారు. మెయిన్‌లైన్‌లో రైలు సేవల పునరుద్ధరణ కోసం వెయ్యి మందికి పైగా కార్మికులు, సిబ్బంది, వివిధ విభాగాలకు చెందిన సూపర్‌వైజర్లు కృషి చేశారు. అధునాత క్రేన్‌లను, యంత్రాలను ఉపయోగించారు. జిల్లా కలెక్టర్, ఎస్‌పి ఆదేశాలతో జిల్లాలోని పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలు సహాయక చర్యలు ప్రారంభించాయి. ఒడిశా నుంచి నాలుగు డిజాస్టర్ బృందాలు చేరుకోగా, 85 మంది ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది, 123 మంది ఎస్‌సిఆర్ ఎఫ్ సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. విశాఖ, విజయనగరం వైద్య బృందాలు బాధితులకు చికిత్స అందించాయి. సహాయక చర్యలను జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర అశోక పర్యవేక్షించారు. పెద్ద ఎత్తున పోలీసులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సోమవారం ఉదయం 11.45కి ట్రాక్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను రైల్వే ఇంజినీరింగ్ అధికారులు ఇవ్వడంతో మధ్యాహ్నం 2:23 గంటలకు డౌన్‌లైన్‌లో గూడ్స్ రైలును, 2:36 గంటలకు అప్‌లైన్‌లో భువనేశ్వర్ - బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను నడిపారు. ప్రమాదం కారణంగా 47 రైళ్లు రద్దయ్యాయి. 24 రైళ్లు దారి మళ్లించబడ్డాయి. ఎనిమిది రైళ్లు షార్ట్ టెర్మినేట్ చేయబడ్డాయి. ఎనిమిది రైళ్లను రీషెడ్యూల్ చేశారు.

బాధితులకు ప్రభుత్వం ఆదుకుంటుంది
డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు

ఘటనా స్థలంలో సహాయక చర్యలను డిప్యూటీ సిఎం బూడి ముత్యాలునాయుడు పరిశీలించారు. ప్రమాద బాధితులకు ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో హుటాహుటిన సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఉన్నారు.

మృతుల వివరాలు

1. కంచుబారికి రవి - గొడుకొమ్ము (జామి మండలం, విజయనగరం జిల్లా)
2. కరణం అప్పలనాయుడు - కాపుశంభాం (గరివిడి మండలం, విజయనగరం జిల్లా)
3. చల్లా సతీష్ - తోటపాలెం, విజయనగరం పట్టణం
4. చింతల కృష్ణంనాయుడు - కొత్తవలస (విజయనగరం జిల్లా)
5. రెడ్డి సీతంనాయుడు - రెడ్డిపేట (చీపురుపల్లి మండలం, విజయనగరం జిల్లా)
6. మజ్జి రాము - గదబవలస (గరివిడి మండలం, విజయనగరం జిల్లా)
7. పిల్ల నాగరాజు - కాపు శంభాం (గరివిడి మండలం, విజయనగరం జిల్లా)
8. ఎం.శ్రీనివాసరావు - (పార్వతీపురం, పలాస పాసింజర్ రైలు గార్డు)
9. గిడిజాల లక్ష్మి - ఎస్‌పి రామచంద్రాపురం (జి.సిగడాం, శ్రీకాకుళం జిల్లా)
10. టెంకాల సుగుణమ్మ - మెట్టవలస (జి.సిగడాం, శ్రీకాకుళం జిల్లా)
11. సింగంపల్లి మధుసూదనరావు - లోకో పైలెట్, కరాస (విశాఖపట్నం)
12. ఎస్.చిరంజీవి - అసిస్టెంట్ డ్రైవర్ - కుశాలపురం (ఎచ్చెర్ల, శ్రీకాకుళం జిల్లా)
13. గుర్తించని మృతదేహం (కర్నూలు జిల్లా)


విజయనగరం సర్వజన ఆస్పత్రిలో క్షతగాత్రులతో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జిల్లాకార్యదర్శి తమ్మినేని

రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలి

- కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాల వల్లే రైలు ప్రమాదాలు
- రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిహారం పెంచాలి : బివి రాఘవులు
- సర్వజన ఆస్పత్రిలో క్షతగాత్రుల పరామర్శ

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కంటకాపల్లి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో మరణించిన వారికి కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు డిమాండ్ చేశారు. ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న కేంద్ర ప్రభుత్వం ఈ ఘటనకు బాధ్యతగా తనకు తాను శిక్ష వేసుకోవాలని అన్నారు. రైలు ప్రమాదంలో గాయపడి విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని, వారి కుటుంబ సభ్యులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణతో కలిసి సోమవారం ఆయన పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సలందతో మాట్లాడారు. ఆ తర్వాత మీడియాతో రాఘవులు మాట్లాడుతూ.. రైలు ప్రమాదం జరగడం బాధాకరమన్నారు. క్షతగాత్రులలో పలువురికి తీవ్రమైన దెబ్బలు, ఇద్దరికి మెడకు దెబ్బలు తగిలాయని తెలిపారు. ఎక్స్‌రేలు తీసినా ఏమైంది అనేది ఇంతవరకు చెప్పలేదని బాధితులు తెలిపారని చెప్పారు. మరో ముగ్గురికి చేతులు, కాళ్లు విరిగాయన్నారు. వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని బాధితులు చెప్పారని, సకాలంలో మెరుగైన వైద్యం అందించిన వైద్యులకు, సిబ్బందికి పార్టీ తరపున అభినందనలు తెలిపారు. అయితే, బాధితుల సమాచారం ఇప్పటికీ వారి కుటుంబ సభ్యులకు, బంధువులకు లేదని, రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించి సమాచారం ఇచ్చి ఓదార్పు కలిగించాలని కోరారు. ఇప్పటికే తమ పార్టీ కార్యకర్తలు, యువకులు రక్తదానం చేశారని, ఇంకా ఎటువంటి సహాయక చర్యలు అయినా అందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బాధితులకు సహకరించేందుకు, వారి కుటుంబాలకు సహాయపడేందుకు సిపిఎం అండగా ఉంటుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాల ఫలితంగా రైల్వే సిగ్నల్ వ్యవస్థలో లోపాలు, సిబ్బంది కుదింపు వంటి వాటి వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఒడిశాలోని బాలాసోర్‌లో మాదిరిగా పరిహారం ఇచ్చామని చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. సిగ్నల్ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని, దీనికోసం కమిటీ వేశామని, ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూస్తామని బాలసూర్ ఘటన సందర్భంగా కేంద్రం చెప్పిందన్నారు. ఆ మాట ఆ రోజుకే పరిమితమైందని విమర్శించారు. ప్రయివేటీకరణ, తగినంత మంది సిబ్బందిని నియమించకపోవడం వల్లే రైలు ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని తెలిపారు. ప్రజల ప్రాణాలుపోతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కేంద్రం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియోను రూ.50 లక్షలకు పెంచి ఇవ్వాలని, తీవ్రంగా గాయపడి శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి రూ.25 లక్షలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా బాధితులను అన్ని విధాలా ఆదుకొని, పరిహారం పెంచాలని డిమాండ్ చేశారు. విశాఖ రైల్వే జోన్ ఉంటే మరింత న్యాయం జరిగేదన్నారు. కేంద్రంతో చెలిమి చేస్తోన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రైల్వే జోన్ కోసం, పరిహారం పెంచే విధంగా చొరవ చూపాలని కోరారు.



క్షతగాత్రులకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ సహాయక చర్యలు

- 15 మంది రక్తదానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, కోట

విజయనగరం జిల్లాలోని కంటకాపల్లి సమీపంలో జరిగిన రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి జిల్లా సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు ఆదివారం రాత్రి నుంచి సహాయక చర్యలు చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్‌రావు, అధ్యక్షులు వెంకటేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.హరీష్ ఆధ్వర్యాన 15మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒడిశాలోని బాలాసోర్ రైలు దుర్ఘటన మరవక ముందే మరోసారి రైలు ప్రమాదం వాటిల్లిందని, దీనికి కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలే కారణమని అన్నారు. సరైన సిగ్నల్ వ్యవస్థ లేకపోవడం, తగినంత సిబ్బందిని నియమించకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు సిహెచ్.పావని, జిల్లా కార్యవర్గ సభ్యులు రాము, సౌమ్య, రవి,సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో పేదల ఆగ్రహం

- ఇళ్ల పట్టాల కోసం ఎమ్మెల్యే నివాసం ముట్టడి
- అరెస్టు సమయంలో పలువురికి అస్వస్థత

ప్రజాశక్తి -పెనుకొండ

ఇళ్ల పట్టాల కోసం పేదలు తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. గత కొన్ని రోజులుగా సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పెనుకొండ పట్టణం మడకశిర రోడ్డులోని ప్రభుత్వం స్థలంలో ఇటీవల భూ స్వాధీన పోరాటం నిర్వహించి, అందులో గుడిసెలు వేసుకున్నారు. ఈ గుడిసెలను నాలుగు రోజుల క్రితం రెవెన్యూ, పోలీస్ అధికారులు తొలగించారు. దీనిని నిరసిస్తూ పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ ఇంటి ముట్టడికి సిపిఎం పిలుపునిచ్చింది. అందులో భాగంగా సోమవారం ఉదయం పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే శంకర్ నారాయణ ఇంటిని పేదలు ముట్టడించారు. ఇంటి ప్రధాన గేటుకు వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆందోళనను విరమించాలని ఆందోళనకారులను పోలీసులు కోరారు. తమకు ఇళ్ల పట్టాలు ఇస్తేనే ఆందోళన విరమిస్తామని స్పష్టం చేశారు. దీంతో సిపిఎం నాయకులు, మహిళలను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసేందుకు యత్నించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నారాయణ, తిప్పన్న, సిపిఎం నాయకులు కొండా వెంకటేష్ తదితరులను బలవంతంగా అరెస్ట్ చేసి సోమందేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడును అరెస్టు చేసే క్రమంలో మహిళలు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. ఈ సమయంలో నాయకులు గంగాధర్, వెంకటరాముడులు స్పృహ తప్పి అస్వస్థతకు గురయ్యారు. వీరిని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. రొద్దం పోలీసు స్టేషన్‌లో ఉన్న పెద్దన్న కూడా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయనను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అరెస్టులు చేసినంత మాత్రాన తమ ఉద్యమాన్ని ఆపేది లేదని ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని మహిళలు, సిపిఎం నాయకులు తేల్చి చెప్పారు.


ఎమ్మెల్యే ఇంటి వద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, పేదలు

10 నుంచి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - తిరుచానూరు (తిరుమల)

అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబర్ పదో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అమ్మవారి ఆలయం ముందు బ్రహ్మోత్సవాల బుక్ లెట్‌ను టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అవిష్కరించారు. బ్రహ్మోత్సవాలకు ముందు ఏడో తారీఖున అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 9న లక్ష కుంకుమార్చన నిర్వహించి బ్రహ్మోత్సవాలకు సకల సదుపాయాలను, సిబ్బందిని సిద్ధం చేస్తామన్నారు. 14న జరిగే గజ వాహనాన్కి ప్రత్యేక భజన బృందాలు ఉంటాయని, ఆ రోజు ఎంతో విశేషం కావున సందర్శకుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. 18న పంచమి తీర్థం జరుగుతుందని, దీనికి పుష్కర్ణికి రూ. తొమ్మిది కోట్లు వెచ్చించి అధునిక హంగులతో సుందరీకరణ చేస్తామన్నారు. పుష్కర్ణిలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తావు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఇఒ ధర్మారెడ్డి, సివిఎస్ఒ నరసింహ కిషోర్, తుడా చైర్మన్ మోహిత్ రెడ్డి, జెఇఒ వీరబ్రహ్మం, ప్రధాన అర్చకులు బాబుస్వామి తదితరులు పాల్గొన్నారు.



: రిలే దీక్షలో మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

పిఎసిఎస్‌ల ప్రయివేటీరణను విడనాడాలి

- వ్యవసాయ సహకార ఉద్యోగ సంఘాల యూనియన్ రిలే దీక్షల్లో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

సహకార రంగంలో ప్రయివేటీకరణ విధానాలను విడనాడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. పిఎసిఎస్‌ల ప్రయివేటీకరణ విధానాలు విడనాడాలని, ఉద్యోగులకు వేతన సవరణ చేయాలనే తదితర డిమాండ్లతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార ఉద్యోగ సంఘాల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గుంటూరులోని సహకార శాఖ కమిషనరేట్ వద్ద మూడ్రోజులపాటు నిర్వహించే రిలే దీక్షలను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 ఏళ్లకుపైగా రైతులకు రుణసదుపాయం కల్పిస్తున్న పిఎసిఎస్‌లలో ప్రయివేటు వ్యక్తులకు 50 శాతం వాటాను అప్పగిస్తూ తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. ఈ నిర్ణయంతో పిఎసిఎస్‌లు నిర్వీర్యం అవుతాయని, కేంద్రం చేసిన చట్టమే దీనికి కారణమని విమర్శించారు. 2019 నుంచి ఉద్యోగులకు వేతన సవరణ పెండింగ్‌లో ఉందని, తక్షణమే వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచుతూ చేసిన నిర్ణయాన్ని పిఎసిఎస్ ఉద్యోగులకూ వర్తింపజేయాలని కోరారు. యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉంటామని రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానం చేసి, ఎన్నికల్లో గెలిచాక తీవ్ర నిర్బంధానికి గురి చేస్తోందన్నారు. వేతన సవరణ చేయకపోవడం వల్ల పెరిగిన ధరలతో ఉద్యోగుల జీవనం దుర్భరంగా మారిందని తెలిపారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి, కార్యదర్శి బి.లక్ష్మణరావు, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, వివిధ జిల్లాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో వైద్య విప్లవం

- రాష్ట్రంలో 12,422 మెడికల్ క్యాంపులు
- సమీక్షలో మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి అమరావతి బ్యూరో

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య విప్లవం తీసుకొచ్చామని వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. మంగళగిరిలోని ఎపిఐఐసి భవనంలో సోమవారం ఆరోగ్య సురక్షపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలందరికీ ఆరోగ్య భరోసాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,422 మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నెల 29 నాటికి మొత్తం 11,208 వైద్య శిబిరాల నిర్వహణ పూర్తయిందని మంత్రి తెలిపారు. మొత్తం 46.31 లక్షల ఒపి సేవలు రాష్ట్ర వ్యాప్తంగా నమోదయ్యాయని చెప్పారు. బిపి పరీక్షలు మొత్తం 21.6 లక్షలు, మధుమేహం టెస్టులు 18.5 లక్షలు, కళ్ల పరీక్షలు 1.79 లక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. ఇంత తక్కువ సమయంలో ఇన్ని లక్షల పరీక్షలు నిర్వహించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఇంటింటికీ వలంటీర్లు, ఎఎన్‌ఎంలు వెళ్లి ఆరోగ్యశ్రీపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, ఆరోగ్యశ్రీ ఆస్పత్రులపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు కావాల్సిన మందులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. దీర్ఘకాలిక రోగాలను నియంత్రించుకునేందుకు సురక్ష కార్యక్రమం ఉపయోగపడిందన్నారు. వ్యాధులకు సంబంధించి ఉచిత మందుల పంపిణీకి అధికారులు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, కమిషనరు నివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మృత్యు శకటాలు

విజయనగరం జిల్లాలో ఆదివారం పొద్దు వాలుతున్న సమాయన సంభవించిన ఘోర రైలు ప్రమాదం పదమూడు మంది అమాయకుల ప్రాణాలను కబళించింది. వంద మంది వరకు క్షతగాత్రులను చేసింది. విశాఖ నుంచి పలాస వెళుతున్న ప్యాసింజర్ రైలుకు సిగ్నల్ అందక కంటకాపల్లి సమీపంలో ట్రాక్‌పై నిలిపి ఉంచగా, వెనక నుంచి అదే పట్టాలపై విశాఖ నుంచి రాయగడ వెళ్లే ప్యాసింజర్ రైలు వేగంగా ఢీకొట్టింది. ఆ ధాటికి రాయగడ రైలు కొన్ని బోగీలు నుజ్జునుజ్జు కాగా మరికొన్ని పక్క ట్రాక్‌లోని గూడ్స్ రైలు మీదికి దూసుకెళ్లాయి. ఈ భీతావహంలో చనిపోయిన వారిలో ఇద్దరు లోకో పైలెట్లు, గార్డు కూడా ఉండటం విషాదం. ముందుగా వెళ్లిన రైలుకు సిగ్నల్ అందని పరిస్థితి ఉండగా వెనుక మరో రైలును అదే ట్రాక్‌పై పంపడం రైల్వే భద్రత డొల్లతనానికి నిదర్శనం. ఇదే రూట్‌లో ఒడిశాలోని బాలాసోర్ వద్ద జూన్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 296 మంది మరణించగా 1,200 మంది గాయపడ్డారు. ఆ ఘోర కలిని మర్చిపోక ముందే అదే తరహాలో సిగ్నల్ వైఫల్యం కారణంగా మూడు రైళ్లు గుద్దుకున్నాయి. ఈ నెలలోనే బీహార్‌లో పట్టాలు ఊడిపోవడాన్ని గమనించిన డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో పెనుముప్పు తప్పింది. నాలుగు మరణాలు, 70 మందికి గాయాలతో సరిపోయింది. వరుస రైలు ప్రమాదాలతో రైలు ప్రయాణమంటేనే ప్రజలను భీతిల్లజేస్తోంది.

దుర్ఘటన జరిగిన ప్రతిసారీ ప్రముఖుల సంతాపాలు, పరామర్శలు, తృణమో పణమో పరిహారాలు మినహా ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపి, కారణాలు కనుగొని, పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టే విషయంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యత తప్పింది. అందుకే పదే పదే ఒకే తరహా ప్రమాదాలు ప్రయాణీకులను బలితీసుకుంటున్నాయి. ప్రభుత్వం వైఫల్యాల నుంచి ప్రజలను ఏమారుస్తోంది. రైల్వే భద్రత విషయంలో మోడీ ప్రభుత్వ ఉద్దేశపూర్వక నిర్లక్ష్యాన్ని 2022లో విడుదల చేసిన కాగ్ నివేదిక కుండబద్దలు కొట్టింది. దాదాపు రైలు ప్రమాదాలన్నీ పట్టాలు తప్పడం వల్లనే సంభవిస్తున్నాయని, పట్టాల పునరుద్ధరణకు నిధులు కేటాయించాల్సి ఉండగా, 2017లో ప్రత్యేకంగా నెలకొల్పిన రాష్ట్రీయ రైలు రక్షణ నిధి నిధులు తగ్గించిన వైనాన్ని కాగ్ ఎత్తి చూపింది. అలాగే రైల్వేలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రిపోర్టు ప్రకారం రైలు ప్రమాదాలపై రైల్వే సేఫ్టీ కమిషనర్ దర్యాప్తు చేసి సమర్పించిన నివేదికలపై ఎలాంటి చర్యలూ లేవు. ఇదీ ప్రయాణీకుల ప్రాణాలకు మోడీ ప్రభుత్వం ఇచ్చే విలువ. బాలాసోర్ ఘటన విషయానికే వస్తే సిబిఐ దర్యాప్తు చేసి ముగ్గురు అధికారులను అరెస్టు చేసి కోర్టులో ఛార్జిషీట్ వేసి మమ అనిపించింది. కానీ సిగ్నలింగ్ వ్యవస్థ ఏమాత్రం మారలేదని విజయనగరం ఘటన వలన తేటతెల్లమవుతోంది.

కేంద్రంలో బిజెపి వచ్చాక రైల్వేల ప్రైవేటీకరణ దూకుడుగా జరుగుతోంది. వందల ప్రైవేటు రైళ్లొచ్చాయి. అదానీ వంటి కార్పొరేట్లకు రైల్వే ఆస్తులు ధారాదత్తమవుతున్నాయి. రైల్వే ప్రత్యేక బడ్జెట్ ఎత్తేశారు. ప్యాసింజర్ రైళ్లు రద్దవుతూ వందేభారత్, హైస్పీడ్ ట్రైన్లు ప్రవేశపెడుతున్నారు. 2022 చివరి నాటికి రైల్వేలలో మూడు లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని స్వయాన రైల్వేశాఖ మంత్రి రాజ్యసభలో వెల్లడించారు. రైళ్లల్లో ప్రతి రోజూ రెండున్నర కోట్ల మంది గమ్యస్థానాలకు చేరుతున్నారు. ఒక వైపు రైల్వేల ద్వారా ఏడాదికి రూ.2.40 లక్షల కోట్ల ఆదాయాన్ని మోడీ ప్రభుత్వం ఆర్జిస్తూ మరో వైపు ప్రయాణీకుల భద్రతకు ఏడాదికి రూ.5 వేల కోట్లు కూడా కేటాయించడం లేదు. సిబ్బంది లేని వేలాది లెవెల్ క్రాసింగ్‌లు పెట్టుకొని బుల్లెట్ రైళ్లనడం మోడీ ప్రభుత్వానికే చెల్లుతుంది. రైలు ప్రమాదాలను మానవ తప్పిదంగానో, కుట్రగానో చిత్రించడం తప్పించుకొనే ఎత్తు. ప్రపంచంలోనే అతి పెద్ద పబ్లిక్ రంగ రవాణా వ్యవస్థ మన రైల్వే. అత్యధిక ఉద్యోగులు పని చేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థగా మన రైల్వేలకు పేరుంది. రైల్వేలపట్ల ప్రభుత్వ విధానాల్లో మార్పు రానంత వరకు ప్రయాణీకుల ప్రాణాలు గాలిలో పెట్టిన దీపాల చందమే. విజయనగరం దుర్ఘటనతోనైనా కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖ మేల్కోవాలి. ప్రమాద బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలి.

మహనీయుల మాట




భారతదేశం వైవిధ్యభరితమైనది. ఇలాంటి దేశంలో జాతీయాభివృద్ధి సాధించే క్రమంలో వివిధ జాతుల మధ్య సమైక్యత, సామరస్యం ఎంతగానో అవసరం. అందువల్ల మన సంస్కృతి యొక్క మిశ్రమ స్వభావం గురించి ప్రబోధించడం సమాజానికి రాజకీయంగా అవసరం.

- అస్గర్ అలీ ఇంజనీర్,
ప్రసిద్ధ రచయిత, సామాజిక కార్యకర్త.

వాస్తవాలను భరించలేని ఫాసిస్టు ప్రభుత్వం


అన్ని ఫాసిస్టు సంస్థలకూ ఒక ఉమ్మడి లక్షణం ఉంటుంది. వాళ్ళు జనం మీదకు వదిలే ప్రచారం బూటకం అని రుజువు చేసే ఆధారాలను వాళ్ళు పూర్తిగా తిరస్కరిస్తారు. ఆ ఆధారాలు వాస్తవమే అయినా ఆ విషయాన్ని ఒప్పుకోరు. మన దేశంలో అధికారంలో ఉన్న హిందూత్వ శక్తులు కూడా ఇదే మాదిరిగా ఉన్నారు. తమ ఆధ్వర్యంలో భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక వేగంతో అభివృద్ధి చెందుతున్న దేశంగా దూసుకుపోతోందని, ఇంత మంచి పాలనను గతంలో ప్రజలు ఎన్నడూ చూసి వుండలేదని వాళ్ళు ప్రచారం చేస్తున్నారు. అంతర్జాతీయ సంస్థలు గాని, ఆఖరికి తమ ఆధీనంలో నడిచే ప్రభుత్వ సంస్థలు గాని ఆ ప్రచారానికి విరుద్ధంగా ఉన్న ఆధారాలను వెల్లడి చేస్తే అటువంటి ఆధారాలన్నీ తప్పుల తడకలని దబాయిస్తారు. ఇండియాలో ఫాసిస్టు హిందూత్వ శక్తుల ప్రచార సూక్తి చాలా స్పష్టం. "మోడీ ఏం చెప్తాడో అదే సత్యం" అన్నదే ఆ సూక్తి. అందుకు భిన్నంగా ఏ వాస్తవమైనా బైట పడితే అది తప్పు అయివుండాలి. వాళ్ళ లెక్కల్లో బహుశా అది కడు దుర్మార్గమైన ఉగ్రవాద కుట్రలో భాగం అయివుంటుంది.

ఒక విషయాన్ని మొత్తంగానే తిరస్కరించడం వేరు, దానిని విమర్శనాత్మకంగా పరిశీలించడం వేరు. ఒకవేళ హిందూత్వ శక్తులు వెలుగులోకి వచ్చిన ఆధారాలను విమర్శనాత్మకంగా పరిశీలించి చర్చిస్తే అది చాలా ఉపయోగకరమైన చర్చ అవుతుంది. మేధోపరమైన మథనం ఎలా జరిగినా దాని వల్ల ఉపయోగమే. వెలికి తీసిన ఆధారాలను భిన్నమైన కోణాల నుండి పరిశీలించి నిగ్గు తేల్చడానికి గాని, ఆధారాలను సేకరించడానికి మరింత మెరుగైన పద్ధతులను అనుసరించడానికి గాని అది దారి తీస్తుంది. కాని అటువంటి మేధోపరమైన విమర్శనాత్మక చర్చ హిందూత్వ వాదులకు శక్తికి మించిన పని. వెలుగులోకి వచ్చిన వాస్తవాలను, వాటి ఆధారాలను తిరస్కరించడం ఒక్కటే వాళ్ళకి తెలుసు. ఆ ఆధారాలను, వాస్తవాలను ఎందుకు తిరస్కరించాలో ఆ కారణాలను కూడా వాళ్ళు చెప్పలేరు.



ప్రభాత్ పట్నాయక్

మోడీ ప్రభుత్వం వాస్తవాలను, వాటికి సంబంధించిన ఆధారాలను తిరస్కరించిన మూడు సందర్భాలను నేనిక్కడ ప్రస్తావిస్తాను. మొదటిది: వినియోగదారులు చేసిన ఖర్చు గురించి 2017-18లో చేసిన జాతీయ శాంపిల్ సర్వేకు సంబంధించినది. 1950 దశకంలో ప్రముఖ గణాంక శాస్త్రవేత్త పి.సి.మహలనోబిస్ ఈ సర్వే విధానాలను రూపొందించారు. ప్రతీ ఐదు సంవత్సరాలకూ ఒక మారు జరిగే పెద్ద శాంపిల్ సర్వే అది. నిజానికి ప్రపంచంలోనే అతి పెద్ద సర్వే అది. ఐతే అటువంటి సర్వేకు సైతం కొన్ని పరిమితులు ఉండవచ్చు. ఎన్ని పరిమితులు ఉన్నప్పటికీ, అది చాలా విలువైన సమాచారాన్ని వెలికి తీస్తుంది. మన దేశంలోనే గాక విదేశాలలో ఉండే పరిశోధకులకు సైతం కొన్ని తరాల వరకూ ఉపయోగపడే విలువైన సమాచారం దాని ద్వారా లభిస్తుంది.



గత కొన్నేళ్ళుగా ప్రపంచ ఆకలి సూచికలో మన స్థానం అధమ స్థాయిలో ఉంటోంది. అది కూడా దిగజారుతూ వస్తోంది. ఒకవైపు ఆకలి తీవ్రత, ఆకలిగొన్నవారి సంఖ్య నానాటికీ పెరిగిపోతూ వుండడం, మరొక వైపు మన జిడిపి నానాటికీ పెరుగుతూ వుండడం-ఈ రెండు ధోరణులూ ఏక కాలంలో వ్యక్తం ఔతున్నాయి. ఈ ధోరణి నయా ఉదారవాద ధానాలతోబాటు కానవస్తోంది.

2017-18 సర్వే భారతదేశంలో పెరుగుతున్న పేదరికం ఎంత దయనీయంగా ఉందో వెల్లడించింది. దాంతో మోడీ ప్రభుత్వం ఆ సర్వే వివరాలను బహిరంగ పరచనివ్వలేదు. అంతేగాక, అటువంటి సర్వేలు ఇకముందు జరగకుండా నిలుపు చేసేసింది. ప్రభుత్వం ఆ వివరాలను తొక్కిపెట్టేలోపే అందులో కొన్ని వివరాలు బైటకొచ్చాయి. వాటిని బట్టి చూస్తే గ్రామీణ భారతంలో రోజుకు తలసరి కనీసం 2200 కేలరీల శక్తిని ఇచ్చే ఆహారాన్ని పొందలేకపోతున్న ప్రజలు 2011-12 నుండి 2017-18 మధ్య కాలంలో 68 శాతం నుండి 78.5 శాతానికి పెరిగారు.

ఈ సర్వే వివరాలను చూసి ప్రభుత్వం అప్రమత్తం అయ్యేబదులు ఆ సర్వే వివరాలను మొత్తంగా తొక్కిపెట్టివేయడమే కాకుండా, ఇకముందు ఆ తరహా సర్వేలు అనేవి అసలు జరగరాదని ఆదేశించింది! ఆ సర్వేపై సందేహాలు ఉంటే మళ్ళీ తాజాగా సర్వే జరపమని ఆదేశించి వుండవచ్చు (గతంలో 2009-10 సర్వే కూడా పేదరికం స్థాయి చాలా ఎక్కువగా ఉన్నట్టు వెల్లడిస్తే అప్పటి యుపిఎ ప్రభుత్వం 2011-12లో మళ్ళీ సర్వే జరపాలని ఆదేశించింది). లేదా ఒక నిపుణుల కమిటీని నియమించి ఆ సర్వే వెల్లడించిన విషయాల ప్రభావం ఏమిటో, పరిస్థితులను చక్కదిద్దే మార్గాలు ఏమిటో సూచించమని కోరవచ్చు. కాని మోడీ ప్రభుత్వం ఏకంగా ఆ సర్వే వివరాలనే కప్పిపెట్టింది. తాము చేసే ప్రచారానికి భిన్నంగా ఉండే వాస్తవాల పట్ల ఫాసిస్టు శక్తులు ప్రతిస్పందించే తీరు ఈ విధంగానే ఉంటుంది.

నా రెండో ఉదాహరణ ఐదవ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేకు సంబంధించినది. ఈ సర్వే 2019-21 మధ్య నిర్వహించారు. 2015-16లో జరిపిన 4వ సర్వే నాటికే చిన్న పిల్లలలోను, మహిళలలోను అధికంగా ఉన్న రక్తహీనత 5వ సర్వేలో మరింత తీవ్ర స్థాయికి చేరినట్టు తేలింది. 6 నెలల నుండి 5 ఏళ్ళ లోపు ఉన్న పిల్లల్లో రక్తహీనత 59 నుండి 67 శాతానికి చేరింది. వారిలో ఒక మోస్తరు నుండి తీవ్ర స్థాయిలో రక్త హీనత ఉన్నవారు 30.6 నుండి 38.1 శాతానికి పెరిగారు. స్వల్ప స్థాయిలో రక్తహీనత ఉన్నవారు 28.4 నుండి 28.9 శాతానికి, అంటే స్వల్పంగానే పెరిగారు. ఇక 49 ఏళ్ళ వరకు వయస్సు ఉన్న మహిళలలో రక్తహీనత 53 నుండి 57 శాతానికి పెరిగింది. వారిలో కూడా ఒక మోస్తరు నుండి తీవ్ర స్థాయిలో రక్తహీనత ఉన్నవారి శాతం 28.4 నుండి 31.4 శాతానికి పెరిగింది. మహిళలతో పోల్చితే పురుషులలో రక్తహీనత తక్కువే ఉంది. అయినప్పటికీ, 49 ఏళ్ళ లోపు పురుషులలో రక్తహీనత 23 నుండి 25 శాతానికి పెరిగింది. వారిలో ఒక మోస్తరు నుండి తీవ్ర స్థాయిలో రక్తహీనత ఉన్న వారు 5 నుండి 8 శాతానికి పెరిగారు. సగటు రక్తహీనత స్థాయి కన్నా గ్రామీణ ప్రాంతంలో జీవించే పిల్లలు, పెద్దల్లో రక్తహీనత ఉన్నవారి శాతం, తీవ్ర స్థాయిలో ఉన్నవారి శాతం ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, మహిళలలో దీని తీవ్రత బాగా ఎక్కువగా ఉంది.

ఈ వాస్తవాల పట్ల ప్రభుత్వం ఏ విధంగా స్పందించింది? నిపుణులను రంగంలోకి దించి, ఆ వాస్తవాలను నిగ్గు తేల్చి, పెరుగుతున్న రక్తహీనతను అరికట్టేందుకు తగిన చర్యలు వెంటనే చేపట్టడం పోయి, ప్రజల ఆరోగ్యం పట్ల ఏ మాత్రమూ శ్రద్ధ కనపరచకుండా, ఆ సర్వే నిర్వహించిన అంతర్జాతీయ జనాభా అధ్యయన సంస్థ డైరక్టర్‌ను విధుల నుండి సస్పెండ్ చేసింది (ఆ డైరక్టర్ వెనువెంటనే రాజీనామా చేశారు. రాజీనామా చేయగానే ఆ సస్పెన్షన్ ను రద్దు చేశారు. దీనిని బట్టి సస్పెండ్ చేయడానికి చూపించిన కారణాలు బూటకం అని స్పష్టం ఔతోంది)! వాస్తవాల పట్ల ఫాసిస్టులు ఏ విధంగా ప్రతిస్పందిస్తారు అనేదానికి ఈ ఉదంతం మరో ఉదాహరణ.

నా మూడో ఉదాహరణ ప్రపంచ ఆకలి సూచికకు సంబంధించినది. ఆకలి బాగా స్వల్ప స్థాయిలో ఉన్న దేశాలను ఈ సూచిక తయారీకి పరిగణన లోకి తీసుకోరు. 2023కు సంబంధించిన ఆకలి సూచికలో 125 దేశాలకు గాను మన దేశం 111వ స్థానంలో ఉంది. మన పొరుగునే ఉన్న పాకిస్తాన్ 102వ స్థానంలో, బంగ్లాదేశ్ 81వ స్థానంలోను, శ్రీలంక 61వ స్థానంలోను, నేపాల్ 69వ స్థానంలోను ఉంటే మనం మాత్రం 111వ స్థానంలో ఉండడమే కాకుండా ఏటికేడూ ఆ స్థానం ఇంకా దిగజారుతోంది !

ఇంత కలవరపరిచే ఈ నిర్ధారణల పట్ల ప్రభుత్వం ఏ విధంగా స్పందించింది? చిన్నపాటి ఆందోళన కూడా వ్యక్తం చేయలేదు. ఏ పాటి శ్రద్ధా కనపరచలేదు. ఆ నిర్ధారణలను మొత్తంగా తిరస్కరించింది. ఒక కేంద్ర క్యాబినెట్ మంత్రి ఏకంగా హాస్యాస్పదమైన, తెలివితక్కువ వ్యాఖ్యలు కూడా చేశారు. ఈ ప్రపంచ ఆకలి సూచికను లెక్కించడానికి నాలుగు కొలబద్దలను ప్రాతిపదికగా తీసుకుంటారు. అవి (1) పోషకాహార లోపం, (2) 5 ఏళ్ళలోపు పిల్లల్లో మరణాల రేటు, (3) పిల్లల్లో ఎదుగుదల లేకుండా గిడసబారిపోవడం, (అంటే వయస్సుకు తగ్గ ఎత్తుకు ఎదగకపోవడం), (4) పిల్లల్లో కృశించిపోయే లక్షణం (అంటే ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం). ఆకలి సూచిక లెక్కకు పెద్దవాళ్ళను కాకుండా పిల్లల పరిస్థితినే అతిగా లెక్కలోకి తీసుకున్నారన్న ప్రభుత్వ వాదన కాస్సేపు సరైనదే అనుకుందాం. కాని, తక్కిన ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే మన దేశంలో పిల్లల పరిస్థితి చాలా ఘోరంగా ఉన్నదన్న చేదు వాస్తవాన్ని ఆకలి సూచిక వెల్లడిస్తోంది. దానిని ఏ మాత్రమూ నిర్లక్ష్యం చేయలేం. అటువంటప్పుడు ప్రభుత్వం చెప్పే సాకుల ప్రాతిపదికన ప్రపంచ ఆకలి సూచిక నిర్ధారణలను తోసిపుచ్చడం ఏ మాత్రమూ తగదు.

ఇంతకూ సదరు మంత్రిగారేమని శలవిచ్చారు? రోజంతా ప్రయాణంలో ఉన్నందువల్ల తానూ ఆకలిగా ఉన్నానని, ఒకవేళ ఎవరైనా ఫోను చేసి అడిగితే ఆ విషయాన్నే చెప్పేదానినని, అప్పుడు తానూ పోషకాహార లేమితో బాధపడుతున్న వ్యక్తిగానే లెక్కించబడతానని ఆమె అన్నారు. ఆకలి సూచికను లెక్కించడానికి మన దేశంలో 3000 మంది నుండి మాత్రమే వివరాలు సేకరిస్తారు గనుక ఆ సూచిక నిర్ధారణలను పట్టించుకోనక్కరలేదని ఆమె అన్నారు.

ఈ సందర్భంలో మూడు విషయాలను స్పష్టం చేయాలి. ప్రపంచ ఆకలి సూచికను లెక్కించడానికి ఉపయోగించే కొలబద్దల్లో పోషకాహార లభ్యత అన్నది ఒక్క కొలబద్ద మాత్రమే. పైగా పోషకాహార లేమిని లెక్కించడానికి కేవలం వ్యక్తులు చెప్పినదాన్నే కాకుండా అధికారికంగా ప్రభుత్వాలు రూపొందించే సమతుల్యాహార లభ్యత గణాంకాలను కూడా లెక్కలోకి తీసుకుంటారు. బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టాక వినిమయదారుల ఖర్చు తీరుతెన్నులను సేకరించే విధానానికి స్వస్తి చెప్పింది. కనుకనే నేరుగా కొంతమందిని కలిసి వారినుండి వివరాలు సేకరించవలసిన అగత్యం ఏర్పడింది.

గత కొన్నేళ్ళుగా ప్రపంచ ఆకలి సూచికలో మన స్థానం అధమ స్థాయిలో ఉంటోంది. అది కూడా దిగజారుతూ వస్తోంది. ఒకవైపు ఆకలి తీవ్రత, ఆకలిగొన్నవారి సంఖ్య నానాటికీ పెరిగిపోతూ వుండడం, మరొక వైపు మన జిడిపి నానాటికీ పెరుగుతూ వుండడం-ఈ రెండు ధోరణులూ ఏక కాలంలో వ్యక్తం ఔతున్నాయి. ఈ ధోరణి నయా ఉదారవాద విధానాలతోబాటు కానవస్తోంది. ఈ ఫాసిస్టు శక్తులు అధికారం లోకి రాకముందు నుండీ ఇదే ధోరణి ఉంటూ వచ్చింది. వాళ్ళు అధికారంలోకి వచ్చాక ఆ ధోరణి మరింత ముదిరింది.

కొందరు వ్యక్తుల నుండి సేకరించిన సమాచారం ఆధారంగా రూపొందించడం వల్ల ఈ ఆకలి సూచికను మంత్రిగారు తప్పుబట్టారు. వినిమయదారుల సర్వేకు బిజెపి ప్రభుత్వం స్వస్తి చెప్పింది గనుకనే ఆ వ్యక్తిగత సర్వే అవసరమైంది. పైగా బిజెపి అధికారంలోకి రాకముందు నుండీ ఆకలి సూచికలో మన స్థానం దిగజారుతూ వస్తోంది. అందుచేత మంత్రిగారి వాదన చెల్లదు. పైగా, ఈ సూచికను రూపొందించడం కోసం అన్ని దేశాల్లోనూ వ్యక్తుల నుండి సమాచారం సేకరిస్తున్నారు. చాలా దేశాల్లో మనకున్న గణాంక వ్యవస్థ వంటి పటిష్టమైన వ్యవస్థలు లేకపోవడమే దానికి కారణం. ఇక మన స్థానం దిగజారిపోవడం అనే ధోరణి వ్యక్తుల నుండి సమాచారం సేకరించే పద్ధతిని అనుసరించక ముందునుంచీ కనిపిస్తూ వుంది.


ఒకపక్క మన జిడిపి పెరుగుతున్నప్పటికీ, పలు సంస్థలు వేర్వేరు ఆధారాల ప్రాతిపదికలను ఉపయోగించి రూపొందించిన సూచికలు మన దేశంలో పోషకాహార లేమి ఎక్కువగా ఉన్నదని, పైగా నానాటికీ అది మరింత ఎక్కువగా పెరుగుతోందని సూచిస్తున్నాయి. ఈ వాస్తవాన్ని చాలా తీవ్రంగా పరిగణించాలి. మన దేశాన్నేలుతున్న ఫాసిస్టు తరహా ప్రభుత్వం మాత్రం ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తూ ఆ సూచికల నిర్ధారణలను తిరస్కరిస్తోంది. తద్వారా తన అసలు స్వభావాన్ని బైటపెట్టుకుంటోంది. ఈ ధోరణి ఇదేవిధంగా కొనసాగితే, మన దేశంలో చాలా శ్రద్ధతో పలు దశాబ్దాల కృషితో నిర్మించుకున్న గణాంక వ్యవస్థను ఈ ప్రభుత్వం అతి త్వరలోనే నాశనం చేయకమానదు.

(స్వేచ్ఛానుసరణ)

వ్యాఖ్య

ప్రమాదకరమైన ఆర్‌ఎస్‌ఎస్ దృక్కోణం !

నాగ్‌పూర్‌లో ఏటా విజయదశమి ర్యాలీలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ చేసే ప్రసంగంలో సంఘ పరివార్‌కు సంబంధించి కొన్ని అధికారిక ప్రకటనలు వుంటాయి. గత కొన్నేళ్ళుగా సాగిన విజయదశమి ప్రసంగాల మాదిరిగానే ఈ ఏడాది అక్టోబరు 24న జరిగిన ర్యాలీలో కూడా మోహన్ భగవత్ ప్రసంగం ఇదే థీమ్‌తో సాగింది. మోడీ ప్రభుత్వంతో సంఘ్ పూర్తిగా పెనవేసుకుపోయింది. ఆర్‌ఎస్‌ఎస్ మార్గదర్శకత్వంతో నడిచే ప్రభుత్వ ప్రాపంచిక దృక్కోణాన్ని వివరించింది. ఈసారి, మోహన్ భగవత్ ప్రసంగం రాబోయే లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధతను ప్రస్తావించింది. బిజెపికి, ప్రభుత్వానికి వెనుక దన్నుగా వుండాలంటూ ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. భారతదేశాన్ని మహత్తర శక్తిగా రూపొందించేందుకు మోడీ ప్రభుత్వం పట్టుదలతో కృషి చేస్తోందంటూ భగవత్ వ్యాఖ్యానించారు. అయితే భారత్ పురోగమించాలని కోరుకోని కొంతమంది వ్యక్తుల వల్ల కొత్త ముప్పు ఎదురవుతోందని భగవత్ వ్యాఖ్యానించారు. "అందుకే వారు సమాజంలో వివక్ష సృష్టించడానికి, నిర్మాణాత్మక సమిష్టి కృషిని విచ్ఛిన్నం చేయడానికి యత్నిస్తుంటారు. వేర్పాటువాదాన్ని, ఘర్షణను సృష్టిస్తుంటారు." ఈ విధ్వంసకర శక్తులను "సాంస్కృతిక మార్క్సిస్టులు లేదా వోక్ లేదా మేల్కొలుపు వ్యక్తులు"గా ఆయన వ్యాఖ్యానించారు. ఈ శక్తులు ఎలా పని చేస్తుంటాయో ఒక చీకటి దృశ్యాన్ని చిత్రించారు. "వారి పద్ధతిలో మీడియాను, విద్యారంగాన్ని పూర్తిగా నియంత్రిస్తారు. విద్య, సంస్కృతి, రాజకీయాలు, సామాజిక వాతావరణాన్ని అయోమయానికి గురిచేయడం, గందరగోళ పరచడం, అవినీతి రంగాల్లోకి నెట్టడం వంటివి వుంటాయి." అని సెలవిచ్చారు.



భగవత్, మోడీలు చేస్తున్న ప్రసంగాలు చూస్తుంటే, హిందూత్వ నిరంకుశ రాజ్యస్థాపన దిశగా వారి యత్నాలు ఉన్నాయనేది స్పష్టం. అన్ని 'పరాయి' శక్తులను ఏరిపారేసేందుకు విద్యా వ్యవస్థను, బహుళ సంస్కృతుల వ్యవస్థను లక్ష్యంగా చేసుకుంటారు. ఈ వినాశకరమైన, ప్రమాదకరమైన లక్ష్యాన్ని సాధించేందుకు ఆర్‌ఎస్‌ఎస్, మోడీ ప్రభుత్వం పూర్తిగా పెనవేసుకుని తన విశృంఖుల రూపాన్ని ప్రదర్శిస్తున్నాయి.

ఈ వంకర, టింకరలతో కూడిన, నిగూఢమైన సూత్రీకరణలు దేనితో రూపొందాయి? 'సాంస్కృతిక మార్క్సిస్టులు' అని ఒక పదాన్ని భగవత్ ఉపయోగించడం ఆసక్తికరం. అంతర్జాతీయంగా మితవాదులు, నయా ఫాసిస్ట్ వర్గాలు ఈ పదాన్ని ఉపయోగిస్తూ వుంటాయి. వారు పేర్కొన్న ప్రకారం, 'సాంస్కృతిక మార్క్సిజం' అనేది పశ్చిమ దేశాల నైతిక విలువలను, నాగరికతను ధ్వంసం చేసి, రాజకీయ దిద్దుబాటు అనే ఉన్నత భావనను విధించే ఒక కుట్ర. ఆర్‌ఎస్‌ఎస్ ఈ పదాన్ని అరువుకు తెచ్చుకోవడంలో ఉద్దేశం తెలిసిందే. ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు సిద్ధాంతాన్ని, భారతీయ సమాజాన్ని, సంస్కృతిని ఏకరూపతగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ పద్ధతుల్ని విమర్శించే వామపక్ష, ప్రజాతంత్ర శక్తులన్నిటిపై 'కల్చరల్ మార్క్సిజం' అనే ముద్ర వేస్తోంది. వాస్తవానికి, 1920ల్లో మార్క్స్ నుండి వారు దూరంగా వెళ్లిపోయారని మోహన్ భగవత్ స్వయంగా అంగీకరించినపుడు, సాంస్కృతిక మార్క్సిజం అనే దానికి అర్థముందా?

జాతి దురహంకారం వివిధ రకాల మైనార్టీల పట్ల వివక్షకు వ్యతిరేకంగా మాట్లాడే వారిపై దాడికి 'వోక్', 'వోక్ కల్చర్' అన్న పదాలను కూడా మితవాద శక్తులు ఉపయోగిస్తుంటాయి. అయితే, ఇక్కడ కూడా, 'వోక్'ను ఆచరించేవారు మార్క్సిస్టులు కాదు, పశ్చిమ దేశాల్లో బూర్జువాలు-ఉదారవాదులే దీనిని ఆచరిస్తుంటారు. భారతీయ సంస్కృతి నుండి వేరు పడినందుకు భారత్‌లోని వామపక్ష శక్తులపై దాడి చేసేందుకు అల్ట్రా-కన్జర్వేటివ్‌ల హక్కును భగవత్ గుడ్డిగా అనుకరించారు. తద్వారా విద్యా వ్యవస్థకు మతం రంగు పులమడానికి, జెఎన్‌యు వంటి విశ్వవిద్యాలయాలను లక్ష్యంగా చేసుకోవడానికి ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలో జరుగుతున్న యత్నాలను సమర్థించుకోవాలని చూస్తోంది. విద్యా రంగం మాదిరిగానే, మీడియాను కూడా నియంత్రించడానికి, అణచివేయడానికి వారు ప్రయత్నిస్తున్నారు. 'న్యూస్ క్లిక్'పై దాడి ఈ కోవకు చెందినదే.

ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ వాస్తవ లక్ష్యం వామపక్షాలు. పూణెలో ఇటీవల ఒక పుస్తకావిష్కరణ సభలో ఆయన చేసిన ప్రసంగాన్ని చూసినట్టైతే, ఈ విషయం స్పష్టమవుతుంది. విద్యా వ్యవస్థలోకి, ఇతర వ్యవస్థల్లోకి చొచ్చుకుపోయిన వామపక్ష ఆవరణానికి వ్యతిరేకంగా పోరాటం సాగించాలని ఆ కార్యక్రమంలో ఆయన పిలుపునిచ్చారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఈ పదాన్ని అరువుకు తెచ్చుకోవడంలో ఉద్దేశం తెలిసిందే. ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు సిద్ధాంతాన్ని, భారతీయ సమాజాన్ని, సంస్కృతిని ఏకరూపతగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ పద్ధతుల్ని విమర్శించే వామపక్ష, ప్రజాతంత్ర శక్తులన్నిటిపై 'కల్చరల్ మార్క్సిజం' అనే ముద్ర వేస్తోంది.

సామాజిక న్యాయం కోసం వివిధ సామాజిక అణచివేతలకు గురైన గ్రూపులు తమ హక్కుల కోసం గట్టిగా నినదించటం ఆర్‌ఎస్‌ఎస్‌ను ఎక్కువగా కలవర పరుస్తోంది. ఏ రాష్ట్రం లేదా ప్రాంతీయ ఆకాంక్షలనైనా విచ్ఛిన్నకరమైనవిగానే పరిగణిస్తోంది. మణిపూర్‌లో హింస, ఘర్షణలు విదేశీ, విధ్వంసకర శక్తుల కారణంగా చోటు చేసుకున్నాయి తప్ప...ఈశాన్య భారతంలో బిజెపి, సంఘ పరివార్ పెంచి పోషిస్తున్న సంకుచిత అస్తిత్వ రాజకీయాల వల్ల కాదని భగవత్ అనుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. భగవత్ వ్యక్తం చేసిన అభిప్రాయాలనే అదే రోజు ఢిల్లీలో దసరా ర్యాలీలో ప్రధాని మోడీ కూడా వ్యక్తం చేశారు. కులతత్వం, ప్రాంతీయవాదం పేరుతో దేశాన్ని విభజించడానికి ప్రయత్నిస్తున్న శక్తులను ఓడించడం గురించి ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తయారు చేసేందుకు తాను ప్రయత్నిస్తున్న సమయంలో, కులతత్వం ద్వారా దేశాన్ని విభజించే సాధనంగా కులగణన డిమాండ్‌ను మోడీ చూస్తున్నారు. అయోధ్యలో రామాలయాన్ని ప్రారంభించడమే జాతీయ పునరుజ్జీవనానికి చిహ్నంగా మోహన్ భగవత్, మోడీలు చూస్తున్నారు. విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా దీన్ని ఒక సాంస్కృతిక ఐక్యతా చిహ్నంగా వారు చూపుతున్నారు.

భగవత్, మోడీలు చేస్తున్న ప్రసంగాలు చూస్తుంటే, హిందూత్వ నిరంకుశ రాజ్యస్థాపన దిశగా వారి యత్నాలు ఉన్నాయనేది స్పష్టం. అన్ని 'పరాయి' శక్తులను ఏరిపారేసేందుకు విద్యా వ్యవస్థను, బహుళ సంస్కృతుల వ్యవస్థను లక్ష్యంగా చేసుకుంటారు. ఈ వినాశకరమైన, ప్రమాదకరమైన లక్ష్యాన్ని సాధించేందుకు ఆర్‌ఎస్‌ఎస్, మోడీ ప్రభుత్వం పూర్తిగా పెనవేసుకుని తన విశృంఖుల రూపాన్ని ప్రదర్శిస్తున్నాయి.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

కవిత్వం

నీ ఓటు..!

నీ ఓటు...
అవనీతిపరుల గుండెల్లో
రైళ్ళు పరిగెత్తించాలి.
నీ ఓటు...
కబ్జా కోరుల కోరలను
పెకలించాలి.
నీ ఓటు...
నేర చరిత గల నాయకుల
వెన్ను విరచాలి.
నీ ఓటు...
భ్రష్టు పట్టిన రాజకీయాలకు
చరమగీతం పాడాలి.
నీ ఓటు...
మోసపూరిత వాగ్దానాలను
దహనం చేయాలి.
నీ ఓటు ...
వారసత్వ రాజకీయాలను
తుద ముట్టించాలి.
నీ ఓటు .....
నియంతృత్వ నాయకులను
మట్టి కరిపించాలి.
నీ ఓటు
కోట్ల భారతీయుల
భవిష్యత్‌ను నిర్దేశించాలి.
నీ ఓటు
పేదల చీకటి బతుకుల్లో
ఆశా జ్యోతిని వెలిగించాలి..
అందుకే....లే...మేల్కొను
నీ ఓటు ఆయుధంతో
విజ్ఞతతో వ్యవహరించు
సమర్థతను ..సచ్ఛీలతను
పారదర్శకతను...స్వచ్ఛతను
ఎన్నుకో...బలహీనతలకు
లోబడితే మరో ఐదేళ్ళు
శిక్ష అనుభవించక తప్పదు.

- కయ్యూరు బాలసుబ్రమణ్యం,
సెల్ : 9441791239

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి. పంపాల్సిన మెయిల్ : editpageps@gmail.com

ఇజ్రాయిల్ మారణకాండను ఆపాలి!

- లండన్‌లో ఐదు లక్షల మందితో భారీ ప్రదర్శన
- ప్రపంచ వ్యాపితంగా పలు నగరాల్లో పాలస్తీనా సంఘీభావ ర్యాలీలు



పాలస్తీనాకు సంఘీభావంగా లండన్‌లో 5లక్షల మందితో భారీ ర్యాలీ

లండన్ : ఇజ్రాయిల్ హంతక దాడులకు వ్యతిరేకంగా, పాలస్తీనియన్లకు సంఘీభావంగా బ్రిటన్‌లో ఆదివారం అయిదు లక్షల మందితో భారీ ర్యాలీ జరిగింది. బ్రిటన్‌తో బాటు ప్రపంచవ్యాపితంగా పలు నగరాల్లో శని, ఆదివారాల్లో ప్రదర్శనలు, సంఘీభావ సమావేశాలు పెద్ద ఎత్తున జరిగాయి. వీధుల్లోకి వచ్చిన ప్రజలు ఆగ్రహంతో ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే కాల్పుల విరమణ పాటించాలన్న నినాదాలతో లండన్ వీధులు మార్మోగాయి. ఇజ్రాయిల్‌కు బ్రిటిష్ ప్రభుత్వ ఆయుధాల అమ్మకం ఆపాలని వారు కోరారు. ఆదివారం నాటి ప్రదర్శన ఇప్పటివరకు జరిగిన ఆందోళనల్లో అతిపెద్దది.

గత రెండు రోజులుగా గ్లాస్గో, న్యూ కేజిల్, లివర్‌పూల్, బెల్‌ఫాస్ట్, లీడ్స్, బ్రాడ్‌ఫోర్డ్, బ్రిస్టల్, ఇతర కేంద్రాల్లో వేలాదిమంది ప్రదర్శనలు నిర్వహించారు. ' తక్షణమే కాల్పుల విరమణ' పాటించాలని నిరసనకారులు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. లండన్‌లోని పార్లమెంట్ స్క్వేర్‌లో జరిగిన ర్యాలీలో లేబర్ పార్టీ మాజీ నేత జెర్మీ కార్బిన్ మాట్లాడుతూ, కాల్పుల విరమణ తక్షణమే జరగాలంటూ ప్రపంచంలో అత్యధిక దేశాలు ఐక్యరాజ్య సమితిలో ముక్త కంఠంతో డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ తీర్మానంపై ఓటింగ్‌కు బ్రిటన్ ప్రభుత్వం గైర్హాజరు కావడం దేశ ప్రజలను ఎంతగానో బాధిస్తోందని చెప్పారు. తమ ఇళ్లలోకి దూసుకువస్తున్న ఆయుధాల దాడిలో అభం శుభం తెలియని వేలాదిమంది చిన్నారులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాక్ జూయిస్ అలయన్స్‌కి చెందిన నావోమి గ్రీన్‌బర్గ్ మాట్లాడుతూ, తమ ప్రభుత్వం అమ్మిన ఆయుధాలను ఉపయోగించి ఇజ్రాయిల్ మారణకాండకు పాల్పడడం విచారకరమని వ్యాఖ్యానించారు. గాజాలో ప్రజల దిగ్బంధనానికి తక్షణమే స్వస్తి పలికి, కాల్పుల విరమణ జరగాలన్నదే తమ ఏకైక డిమాండ్ అని ఆయన స్పష్టం చేశారు.

పాలస్తీనియన్-బ్రిటీష్ జాతీయురాలైన బాస్మా తన భర్త, ఇద్దరు పిల్లలతో ఈ ప్రదర్శనలో పాల్గొంది. ఆమె తండ్రి, ముగ్గురు సోదరులు గాజాలో వున్నారు. వారు రోజూ పడుతున్న ఇబ్బందులను ఫోన్ ద్వారా ఆమె తెలుసుకుంటున్నారు. పాలస్తీనియన్లకు మాంచెస్టర్‌లో బలమైన సంఘీభావం నెలకొందని చెప్పారు. పాలస్తీనియన్ల వాణి ఎక్కడా వినిపించకుండా సెన్సార్ చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటీష్ మీడియాలో కూడా పాలస్తీనా వాణి సెన్సార్‌కు గురవుతోందన్నారు. ప్రధాన స్రవంతిలోని మీడియా వార్తలకు వాస్తవంగా జరుగుతున్న దానికి చాలా తేడా వుంటోందన్నారు. పాలస్తీనాకు ఎవరు మద్దతు ప్రకటించినా వారిని మొత్తంగా పక్కకు నెట్టేస్తున్నారని అన్నారు.

పాలస్తీనా సాలిడారిటీ క్యాంపెయిన్ (పిఎస్‌సి) డైరెక్టర్ బెన్ జమాల్ మాట్లాడుతూ, పరిస్థితులు మరింత దారుణంగా దిగజారకుండా వుండాలంటే ముందుగా జరగాల్సింది కాల్పుల విరమణ అని స్పష్టం చేశారు.

టోరీ మంత్రి మిషెల్లె డాన్‌లాన్ మాట్లాడుతూ, గాజాలోకి మరింతగా మానవతా సాయం వెళ్లేందుకు వీలుగా, అక్కడున్నవారు ఆ ప్రాంతాన్ని వీడి వెళ్లేందుకు అనుమతించేలా హింసకు విరామం ఇవ్వాలని బ్రిటన్ ప్రభుత్వం కోరుతోందని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా పలు నగరాల్లో...

ప్రపంచవ్యాప్తంగా పలు పట్టణాలు, నగరాల్లో ఆందోళనలు, నిరసనలు కొనసాగుతున్నాయి. పారిస్‌లో పాలస్తీనా అనుకూల ప్రదర్శనలపై నిషేధం వుంది. దాన్ని ఉల్లంఘించి ప్రదర్శనల్లో పాల్గొన్నందుకు వందలాదిమందిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రదర్శకులపై బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. మార్సెలె, స్ట్రాస్‌బర్గ్‌ల్లో కూడా నిరసనలు జరిగాయి. న్యూయార్క్‌లో బ్రూక్లిన్ బ్రిడ్జిపై ఆందోళనకారులు నల్లని టీ షర్టులతో ప్రదర్శన నిర్వహించారు. తక్షణ కాల్పుల విరమణను యూదులు కోరుతున్నారంటూ నినదించారు.

రేపు వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం అందించే వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులను గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా బుధవారం అందజేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం నేపథ్యంలో నవంబరు ఒకటిన విజయవాడలోని ఎ-1 కన్వెషన్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డులను అందజేయనున్నారు. రాష్ట్రంలో ఏడు రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 27 మంది వ్యక్తులు, సంస్థలకు వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, మరో నాలుగు వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ అవార్డులను ఇవ్వనున్నట్టు అవార్డుల స్క్రీనింగ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనరు తుమ్మా విజయకుమార్‌రెడ్డి తెలిపారు ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా వైఎస్ఆర్ జీవిత సాఫల్య, వైఎస్ఆర్ సాఫల్య పురస్కారాలను వరుసగా మూడో ఏడాది ప్రదానం చేయనుందన్నారు.

చంద్రబాబు మధ్యంతర బెయిల్‌పై నేడు తీర్పు

- ఇరుపక్షాల వాదనలు పూర్తి

ప్రజాశక్తి-అమరావతి

స్కిల్ డెవలప్‌మెంటు కేసులో మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం వాదనలు ముగిశాయి. దీనిపై మంగళవారం ఉత్తర్వులు జారీ చేస్తామని జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ప్రకటించారు. మధ్యంతర బెయిల్ కోసం దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌పై వెలువరించే ఆదేశాలకు అనుగుణంగా ప్రధాన బెయిల్ పిటిషన్‌పై విచారణ ఉంటుందని స్పష్టం చేశారు. తన కంటికి శస్త్ర చికిత్స చేయించుకోవాల్సి వుందని, మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలనే అనుబంధ పిటిషన్‌పై గత విచారణ సందర్భంగా హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా సిఐడి అధికారులు చంద్రబాబు వైద్య నివేదికలను నివేదించింది. సిఐడి తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివేకానంద.. రాజమండ్రి సెంట్రల్ జైలులో చంద్రబాబుకు నిర్వహించిన వైద్య పరీక్షల నివేదికలను అందజేశారు. రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్ వాదించారు. ప్రధాన బెయిలు పిటిషన్ తరపున వాదనలు వినిపించారు. సిఐడి తరపున అదనపు ఎజి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ.. ప్రధాన బెయిల్ పిటిషన్‌పై వాదనలకు గడువు కావాలని కోరారు. ఇందుకు అనుమతించిన హైకోర్టు.. మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై వాదనలు వినిపించాలని కోరింది. దీంతో మధ్యాహ్నం అదనపు ఎజి వాదించారు. కంటికి కాటరాక్ట్ ఆపరేషన్ అత్యవసరం కాదన్నారు. మధ్యంతర బెయిల్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. వాదనల తర్వాత మధ్యంతర బెయిల్‌పై తీర్పును మంగళవారం వెలువరిస్తామని హైకోర్టు రిజర్వు చేసింది.

ప్రజా జీవితంలో హాస్యస్ఫూర్తి చచ్చిపోతోంది !

- చంద్రచూడ్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : ప్రజా జీవనంలో హాస్యస్ఫూర్తి అనేది చచ్చిపోయిందని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ఆప్ ఎంపి రాఘవ్ చద్దాపై నిరవధిక సస్పెన్షన్ కేసు విచారణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మీడియాతో మాట్లాడుతూ చమత్కారంగా చద్దా చేసిన వ్యాఖ్యలకు ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. జిఎన్‌సిటిడి (సవరణ) బిల్లు, 202 సెలక్ట్ కమిటీలో చేరేందుకు ఇతర సభ్యులకు 'పుట్టిన రోజు ఆహ్వాన కార్డులు'ను చద్దా పంపారని, ఇతర సభ్యుల ఆమోదం తీసుకోకుండానే చద్దా వారిని ఆహ్వానించారని విమర్శిస్తూ సభా హక్కుల ఉల్లంఘన కింద సస్పెండ్ చేసినట్లు కారణం తెలిపారు. దానిపై చంద్రచూడ్ స్పందిస్తూ 'పుట్టినరోజు ఆహ్వాన పత్రికలు పంపడమంటే ఆ సభ్యులు రావచ్చు, రాకపోవచ్చు, అది సభ ప్రతిష్టను దిగజార్చడం అవుతుందా? సభా హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందా?" అని చంద్రచూడ్ అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణిని ప్రశ్నించారు. అటువంటి వ్యాఖ్యలు సభా ప్రక్రియను దిగజారుస్తాయంటూ వెంకటరమణి మాట్లాడుతుండగానే మధ్యలో చంద్రచూడ్ జోక్యం చేసుకుని ఇదేమీ ప్రత్యేక హక్కును ఉల్లంఘించే పరీక్ష కాదని అన్నారు. సభ నుంచి ప్రతిపక్ష సభ్యులను మినహాయించడం చాలా తీవ్రమైన అంశమన్నారు. ఆయన అభిప్రాయం ఆయనకు వుంటుంది, ప్రభుత్వ అభిప్రాయంతో ఏకీభవించాల్సిన అవసరం లేదు, పార్లమెంట్‌లో ప్రతిపక్షాల వాణిని బహిష్కరించకుండా జాగ్రత్త తీసుకోవాలని చంద్రచూడ్ వ్యాఖ్యానించారు.

దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు

- డ్రైవర్‌కు ఆర్‌టిసి ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కావలిలో ఆర్‌టిసి డ్రైవరు బత్తుల రామ్‌సింగ్‌పై దాడికి పాల్పడ్డ దుండగులపై పోలీసుశాఖ ద్వారా కఠిన చర్యలు తీసుకుంటామని ఎపిఎస్‌ఆర్‌టిసి ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం విద్యాధరపురంలోని ఆర్‌టిసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామ్‌సింగ్‌ను మల్లికార్జునరెడ్డి, ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు కెఎస్ బ్రహ్మానందరెడ్డితో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రామ్‌సింగ్‌కు అందుతున్న వైద్య సేవలను అక్కడున్న చీఫ్ మెడికల్ ఆఫీసర్ డివిఎస్ అప్పారావు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పి శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. రోజూ లక్షలాది మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తూ.. సేవలు అందించే ఆర్‌టిసి సిబ్బందిపై దాడులు చేయడం తగదన్నారు. దాడిపై పూర్తిస్థాయి విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

రామ్‌సింగ్‌కు ఎస్‌డబ్ల్యుఎఫ్ పరామర్శ

కావలిలో ఆర్‌టిసి డ్రైవరుపై దాడిచేసిన అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు చికిత్స పొందుతున్న రామ్‌సింగ్‌ను ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, సిఐటియు రాష్ట్ర నాయకులు ముజఫర్ అహ్మద్, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు టిపిఆర్ దొర, జి సత్యనారాయణ, బిడిఆర్ రెడ్డి సోమవారం పరామర్శించారు. రామ్‌సింగ్‌పై జరిగిన దాడిపై సమగ్ర విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ సుందరయ్య, అయ్యపురెడ్డి వినతిపత్రం పంపారు.

కేసును విజయవాడకు బదిలీ చేయాలి : ఎంప్లాయీస్ యూనియన్

డ్రైవరు రామ్‌సింగ్‌పై జరిగిన దాడి ఘటనలో నమోదైన కేసును విజయవాడ కోర్టుకు బదిలీ చేయాలని ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య కలిసి డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కావలి వద్ద జరిగిన ఈ అమానుష దాడిలో మొత్తం 14 మంది పాల్గొంటే.. కొద్దిమందిని మాత్రమే అరెస్టు చేయడం సరికాదన్నారు. ఈ దాడిలో పాల్గొన్న వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పునరావృతం కానివ్వొద్దు : బిసి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్

రామ్‌సింగ్‌పై దాడికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకుని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎపి పిటిడి బిసి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌పి శేషగిరిరావు, వర్కింగ్ ప్రెసిడెంటు బి వెంకటపతి, నాయకులు ఎం రామస్వామి తదితరులు తదితరులు చికిత్స పొందుతున్న రామ్‌సింగ్‌ను పరామర్శించారు.

ఫార్మా కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

- రేపటి నుంచి రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఇపిసెట్ కన్వీనరు, సాంకేతిక విద్య కమిషనరు సిహెచ్ నాగరాణి విడుదల చేశారు. ఎంపిసి, బైపిసి విద్యార్థులకు వేర్వేరుగా కౌన్సెలింగు జరగనుంది. రెండు విభాగాల విద్యార్థులు నవంబరు ఒకటి నుంచి ఎనిమిది వరకు ఆన్‌లైన్‌లో ప్రోసెసింగ్ ఫీజు చెల్లించాలి. రాష్ట్ర వ్యాప్తంగా కౌన్సెలింగ్ నిర్వహణ కోసం 14 సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఆన్‌లైన్‌తోపాటు సహాయక కేంద్రాల్లో ఆఫ్‌లైన్‌లో జరగనుంది. ఎంపిసి విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ 8, 9 తేదీల్లో జరగనుంది. 10, 11, 12 తేదీల్లో ఆప్షన్ల ఎంపిక, 12న ఆప్షన్లు మార్చుకునే అవకాశం ఉంటుంది. 14న సీట్ల కేటాయింపు పూర్తికానుంది. సీట్లు పొందిన అభ్యర్థులు 15, 16 తేదీల్లో ఆయా కళాశాలల్లో స్వయంగా రిపోర్టు చేయాలి. బైపిసి విద్యార్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ 9, 10, 11 తేదీల్లో ఉంటుంది. 11, 12, 13 తేదీల్లో ఆప్షన్లు ఎంపిక, 14న ఆప్షన్లు మార్చుకునే అవకాశం ఉంటుంది. 17న సీట్ల కేటాయింపు పూర్తికానుండగా, 18 నుంచి 21 వరకు కళాశాలల్లో విద్యార్థులు రిపోర్టు చేయాలి.

తుపాకీ హింసకు మరో 12 మంది బలి

ఫ్లోరిడా : అమెరికాలో తుపాకీ సంస్కృతికి అడ్డు అదుపులేకుండా పోతోంది. గత వారం మెయినేలోని లూయిస్టన్ పట్టణంలో 22 మంది ప్రాణాలు బలిగొన్న అత్యంత ఘోరమైన సామూహిక కాల్పుల ఘటన నుంచి కోలుకోక ముందే ఆదివారం హాలోవెన్ సంబరాల సందర్భంగా చోటు చేసుకున్న వేర్వేరు కాల్పుల ఘటనల్లో 12 మంది చనిపోయారు. డజన్ల కొద్దీ గాయపడ్డారు. ఫ్లోరిడాలోని టాంపా నైట్ క్లబ్‌లో ఆదివారం తెల్లవారు జామున ఇరు గ్రూపుల మధ్య తలెత్తిన ఘర్షణ కాల్పులకు దారి తీసింది. ఈ కాల్పుల్లో ఇద్దరు మరణించారు. మరో 13 మంది గాయపడ్డారు. నిందితుడిగా అనుమానిస్తున్న టైరెల్ స్టీఫెన్ ఫిలిప్స్ (22)ను అరెస్టు చేసినట్టు టాంపా పోలీసు చీఫ్ లీ బెర్కా తెలిపారు. ఇండియానా పోలీస్‌లో జరిగిన కాల్పుల్లో ఒకరు మరణించారు. అమెరికాలో ఈ ఏడాది ఇంతవరకు 580 దాకా కాల్పుల ఘటనలు చోటు చేసుకున్నాయి. చికాగో, కాన్సాస్‌లలో జరిగిన కాల్పుల్లో 9 మంది దాకా చనిపోయారు.

ఒపిఎస్ కోసం 3న ఢిల్లీలో ధర్నా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఒపిఎస్)ను తీసుకురావాలని కోరుతూ.. నవంబరు 3న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో లక్ష మందితో చలో ఢిల్లీ, ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, కెవి శివారెడ్డి, ఎపి పిటిడి నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పివి రమణారెడ్డి పేర్కొన్నారు. విజయవాడలోని గాంధీ నగర్ ఎపి ఎన్‌జిఒ భవనంలో సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. కావలిలో ఆర్‌టిసి డ్రైవరు బిఆర్‌సింగ్‌పై దాడికి పాల్పడిన నిందితులం దరినీ అరెస్టు చేయాలని, పరారీలో ఉన్న ప్రధాన నిందితుడిని తక్షణమే అరెస్టు చేసే వరకు ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. ఉద్యోగులకు సంబంధించిన అరియర్స్, పండగ అడ్వాన్స్‌లు, సరెండర్ లీవు బిల్లులు సెప్టెంబరులోగా చెల్లిస్తామని ప్రభుత్వం పేర్కొందని, తక్షణమే ఆయా చెల్లింపులు జరిగేలా సిఎం చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశానికి ముందు విజయవాడ విద్యాధరపురంలో చికిత్స పొందుతున్న డ్రైవరు రామ్‌సింగ్‌ను ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి ఎన్‌జిఒ అధ్యక్ష, కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, కెవి శివారెడ్డి, ఎన్‌ఎంయు రాష్ట్ర అధ్యక్షులు పివి రమణారెడ్డి పరామర్శించారు.

రాజస్థాన్‌లోని 17 స్థానాల్లో సిపిఎం అభ్యర్థులు పోటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజస్థాన్‌లో రెండు సిట్టింగ్ స్థానాలతో సహా 17 స్థానాలకు సిపిఎం అభ్యర్థులను ప్రకటించింది. ఈ మేరకు సోమవారం సిపిఎం 17 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను విడుదల చేసింది. హనుమాన్‌గఢ్ జిల్లాలోని భద్ర సిట్టింగ్ స్థానం నుంచి బల్వాన్ పునియా మళ్లీ పోటీ చేయనున్నారు. బికనీర్‌లోని మరో సిట్టింగ్ స్థానమైన దుంగార్‌ఘర్‌లో గిర్దారిలాల్ మహియా తిరిగి పోటీ చేయనున్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి అమ్రా రామ్ సికార్ జిల్లాలోని దాతరంగఢ్ నుంచి పోటీ చేయనున్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అమ్రారామ్ 2008లో దాతరాన్‌గఢ్‌లో గెలుపొందారు. మరో మాజీ ఎమ్మెల్యే పేమారామ్ సికార్‌లో పోటీ చేయనున్నారు.

సిపిఎం పోటీ చేసిన ఇతర స్థానాల అభ్యర్థులు

లక్ష్మణ్‌గఢ్ నియోజకవర్గం నుంచి విజేంద్ర ఢాకా, సికార్ నుంచి ఉస్మాన్ ఖాన్, హనుమాన్‌ఘర్ నుంచి రఘువీర్ వర్మ, నోహర్ నుంచి మంగేష్ చౌదరి, రైసింగ్ నగర్ నుంచి షోపేత్ రామ్ మేఘ్‌వాల్, అనుప్‌గఢ్ నుంచి షో సింగ్ ధిల్లాన్, దుంగార్‌పూర్ నుంచి గౌతమ్ తోమర్, తారానగర్ నుంచి నిర్మల్ కుమార్ ప్రజాపత్, సర్దార్‌షహర్ నుంచి ఛగన్‌లాల్ చౌదరి, సదుల్‌పూర్ నుంచి సునీల్ పునియా, జాదౌల్ నుంచి ప్రేమ్ పార్గి, లద్నూ నుంచి భగీరథ్ యాదవ్, నవన్ నుంచి కనరామ్ బిజరానియా పోటీ చేయనున్నారు.

సికార్ జిల్లాలో నలుగురు, హనుమాన్‌గఢ్, చురు జిల్లాల్లో ముగ్గురు చొప్పున, శ్రీగంగానగర్, నాగౌర్‌లో ఇద్దరు చొప్పున, దుంగార్‌పూర్, బికనీర్, ఉదయ్‌పూర్ జిల్లాల్లో ఒక్కో స్థానానికి సిపిఎం అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.



బిజెపికి ధీటుగా సిపిఎం నిలబడుతుంది : అమ్రారామ్

సిపిఎం రాజస్థాన్ రాష్ట్ర కార్యదర్శి అమ్రారామ్ మాట్లాడుతూ.. పోటీ లేని నియోజకవర్గాల్లో బిజెపికి ధీటుగా సిపిఎం నిలబడుతుందన్నారు. రాజస్థాన్‌లో బిజెపికి వ్యతిరేకంగా సమిష్టిగా పోరాడేందుకు కాంగ్రెస్ విముఖత చూపిందని మీడియా అడిగిన ప్రశ్నకు అమ్రారామ్ సమాధానం ఇచ్చారు. 'సీట్ల విషయంలో కాంగ్రెస్ అధిష్టానం అంగీకరించలేదు. సిపిఎంకు గరిష్టంగా మూడు సీట్లు ఇవ్వవచ్చని కాంగ్రెస్ రాజస్థాన్ ఇన్‌ఛార్జ్ సుఖ్‌జీందర్ సింగ్ రంధావా అన్నారు. ప్రస్తుతం సిపిఎంకు రెండు స్థానాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో రెండు చోట్ల రెండో స్థానంలో నిలిచాం. మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో దాదాపు 45 వేల ఓట్లు ఉన్నాయి. బిజెపిపై పోరుకు కాంగ్రెస్ సిద్ధంగా లేని పరిస్థితుల్లో సిపిఎం 17 స్థానాల్లో పోటీ చేస్తోంది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను బట్టబయలు చేసేందుకు, ప్రజా సమస్యలను సభకు తీసుకురావడానికి సిపిఎం అభ్యర్థులను అత్యధిక సంఖ్యలో గెలిపించాలి' అని అమ్రారామ్ అభ్యర్థించారు.

టిడిపిలో సామాజిక ఉగ్రవాదులు

- మంత్రి అంబటి రాంబాబు ఆరోపణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

టిడిపిలో ఒక సామాజిక తరగతి నాయకులు ఉగ్రవాదులుగా మారుతున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. గుంటూరు లోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లా డుతూ.. తనను అంతమొందించేందుకు టిడిపిలోని కొంతమంది కుట్ర చేస్తున్నా రని ఆరోపించారు. టిడిపికి కొమ్ముగాస్తున్న ఒక సామాజిక తరగతి వారు తనకు బంధువులు కూడా ఉన్నారని, కానీ వీరిలో కొంతమంది మాత్రం ఉగ్రవాదులుగా మారి తమకు ఇష్టం లేని వారిని అంతమొందించాలనే కక్షలు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఖమ్మంలో తనపై దాడికి వచ్చిన వారంతా ఒకే సామాజిక తరగతివారని, టిడిపిని వీరే నాశనం చేస్తున్నారని, ఇతర సామాజిక తరగతులకు ప్రాధాన్యం ఇవ్వకుండా ఒక కుల పార్టీగా టిడిపిని తయారు చేస్తున్నారని, ఆందుకే ఆ పార్టీకి ఇప్పుడు ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. చంద్రబాబుపై ఎవరైనా విమర్శలు చేస్తే నిమిషాల్లో స్పందించే పవన్ కల్యాణ్ ఇతర నాయకులపై దాడి చేస్తే మాత్రం స్పందించరని, ఆయన కిరాయి కోటిగాడు అని వ్యాఖ్యానించారు. ఖమ్మంలో తనపై దాడి జరిగినప్పుడే కాదు... గతంలో ముద్రగడ కుటుంబంపై టిడిపి నాయకులు దాడి చేసినా పవన్ కల్యాణ్ స్పందించలేదని విమర్శించారు.

పవన్‌కల్యాణ్ తీరు సరికాదు

- మంత్రి అమర్నాథ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కాపు నాయకులపై దాడి చేసినా స్పందించని పవన్ కల్యాణ్ ఏ సామాజిక తరగతికి మద్దతిస్తున్నారో ప్రజలంతా గమనిస్తున్నారని రాష్ట్ర పరిశ్రమల మంత్రి గుడివాడ అమరనాథ్ వ్యాఖ్యానించారు. మంత్రి అంబటి రాంబాబును గుంటూరులో సోమవారం ఆయన పరామర్శించి, దాడిని ఖండించారు. అంబటి రాంబాబుకు ఏదైనా జరిగితే తాము సహించబోమన్నారు. రాంబాబును అంతమొందిస్తే రూ.50 లక్షలిస్తామని ఖమ్మంలో టిడిపి నాయకులు ప్రకటించినా పవన్‌కల్యాణ్ స్పందించకపోవడం దారుణమన్నారు. స్కిల్ స్కాంలో అరెస్టయిన చంద్రబాబును పరామర్శించడానికి జైలుకు వెళ్లిన పవన్ కల్యాణ్ మంత్రి అంబటిపై ఖమ్మంలో దాడి జరిగితే పట్టించుకోవడం లేదన్నారు. టిడిపికి కొమ్ముగాస్తున్న పవన్ కల్యాణ్‌కు వచ్చే ఎన్నికల్లో కాపులే బుద్ధి చెబుతారని, జైలులో చంద్రబాబును పరామర్శించిన వెంటనే పొత్తుల గురించి మాట్లాడటంపై జనసేన కార్యకర్తలే జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు.

ప్రజోపయోగమైన మేనిఫెస్టోతో ప్రజల్లోకి: గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజోపయోగమైన మేనిఫెస్టోతో ప్రజల్లోకి వెళ్తామని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. పిసిసి నూతన కమిటీ తొలి సమావేశం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో సోమవారం జరిగింది. సమావేశానికి ముందుగా విజయనగరం రైలు ప్రమాద బాధితులకు సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమావేశంలో ఎఐసిసి కార్యదర్శి క్రిష్టోఫర్ తిలక్, సిడబ్ల్యుసి సభ్యులు డాక్టర్ ఎన్ రఘువీరారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యులు కెవిపి రామచంద్రరావు, తులసిరెడ్డి, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు, కేంద్ర మాజీ మంత్రులు చింతా మోహన్, జెడి శీలం, సినీ హీరో రాజాతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు. సమావేశానంతరం మాజీ మంత్రి మారెప్ప కాంగ్రెస్ పార్టీలో చేరారు.



ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి

- హైదరాబాద్‌కు తరలింపు
- దాడిని ఖండించిన సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ ఎంపి, దుబ్బాక బిఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం సూరంపల్లిలో సోమవారం జరిగింది. దుబ్బాక నియోజకవర్గంలోని గాజులపల్లి, దొమ్మాట, ముత్యంపేట, సూరంపల్లి గ్రామాల్లో ప్రచారాన్ని ముగించుకొని లింగరాజుపల్లి వెళ్లడానికి సిద్ధమవుతున్న క్రమంలో పెద్ద చెప్యాల గ్రామానికి చెందిన రాజు (యూట్యూబ్ చానెల్ రిపోర్టర్) సెల్ఫీ దిగేందుకు వచ్చి ఎంపిని కత్తితో పొడిచాడు. దీంతో అక్కడే ఉన్న కార్యకర్తలు ఎంపిని హుటాహుటిన గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన రాజుకు బిఆర్‌ఎస్ నాయకులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఎంపిపై కత్తితో దాడికి నిరసిస్తూ సూరంపల్లి రహదారిపై బిఆర్‌ఎస్ నాయకులు ధర్నాకు దిగారు. పోలీస్ వాహనంపైనా దాడి చేశారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ సంఘటనా స్థలానికి చేరుకొని విషయాన్ని తెలుసుకున్నారు. గజ్వేల్ ఆస్పత్రి నుంచి ఎంపి ప్రభాకర్‌రెడ్డిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఎంపి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు, కుటుంబసభ్యులను ఫోన్ ద్వారా మంత్రి హరీశ్‌రావు అడిగి తెలుసుకున్నారు. ఎంపిపై దాడిని ముఖ్యమంత్రి కెసిఆర్ ఖండించారు. రాజకీయాల్లో దాడులు మంచిపద్ధతి కాదన్నారు. తాము తలుచుకుంటే దుమ్మువుతారని హెచ్చరించారు.

రూ.1.68 లక్షల కోట్లు రుణ లక్ష్య సాధనలో బ్యాంకులు ముందంజ

- ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులు రూ.1.68 లక్షల కోట్లు రుణ లక్ష్యాన్ని సాధించడం అభినందనీయమని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బ్యాంకులను అభినందించారు. సోమవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో 224వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ రుణ ప్రణాళిక లక్ష్యం గతేడాది రూ.1.40 లక్షల కోట్లు కన్నా 20 శాతం ఎక్కువగా, అనగా రూ.1.68 లక్షల కోట్లు నమోదు చేయడం శుభ పరిణామం అన్నారు. ఎపి ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరడంలో మెరుగ్గా ఉందని కేంద్ర మంత్రి భగవత్ కృష్ణారావు కరాద్ మెచ్చుకున్నట్లు మంత్రి బుగ్గన పేర్కొన్నారు. పిఎం, ముద్ర, స్టాండప్ ఇండియా సంబంధిత పథకాలకు రుణాలపై బ్యాంకర్లు మరింత దృష్టి సారించాలన్నారు. వచ్చే ఏడాది జూన్ ఆఖరు నాటికి రాష్ట్రంలోని 67,422 మంది కౌలు రైతులకు సహాయం అందించడంలో వ్యవసాయశాఖతో అనుసంధానమై ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకారం అందించాలన్నారు. సెర్ప్‌కు సంబంధించిన బ్యాంకు లింకేజీల ద్వారా ఇప్పటి వరకు రూ.4,286 కోట్లు మాత్రమే రుణాలిచ్చినట్లు మంత్రి చెప్పారు. ఈ సమావేశంతో జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి కె సునీత, ఆర్థికశాఖ కార్యదర్శి కెవివి సత్యనారాయణ, ఇంతియాజ్, గోనాల్, గుణానంద్, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లాడుతోన్న రైతాంగం

- కరువు మండలాల నివేదికను కేంద్రానికి పంపాలి
- సిఎంకు లోకేష్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతోన్న రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన సోమవారం లేఖ రాశారు. వందేళ్లలో ఇంతటి కరువు పరిస్థితులు రాష్ట్రంలో ఎన్నడూ లేవని, తొలిసారి అతి తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. ఎండిన పంటలు చూస్తే గుండె తరుక్కుపోతోందని, పంటల్ని రైతులు తగలబెడుతుంటే కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయని తెలిపారు. నీరు వదిలి పంటల్ని కాపాడాలంటూ అధికారుల కాళ్లపై పడి ప్రాధేయపడుతున్న అన్నదాతలు, సాగునీటి కోసం రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్న రైతులే రాష్ట్రమంతా కనిపిస్తున్నారని వివరించారు. అనేక మండలాల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులను కేంద్రానికి నివేదించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఖరీఫ్ పంటకే నీటికి కటకటలాడుతున్న పరిస్థితి నెలకొందని, రబీ సాగు ప్రశ్నార్థకమే అని పేర్కొన్నారు. కొన్ని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు లేవని, కొన్నిటిలో నీరున్నా వదలకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని వివరించారు. ఈ అస్తవ్యస్త పరిస్థితుల్ని ప్రజలకు వివరించేందుకు వచ్చిన చంద్రబాబు గొంతు నొక్కేందుకు తప్పుడు కేసులు పెట్టి జైలులో బంధించారని విమర్శించారు. పెన్నా, తుంగభద్ర కాలువల కింద, కృష్ణా డెల్టాలోనూ సాగునీటి కోసం అన్నదాతలు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. వరి, మిర్చి, పత్తి, వేరుశనగ పూర్తిగా దెబ్బతిన్నాయని వివరించారు. బోర్లు, బావుల నుంచి నీరందించి పంటలు కాపాడుకుందామంటే కరెంటు కోతలతో సాధ్యం కావడం లేదని పేర్కొన్నారు. యుద్ధ ప్రాతిపదికన కరువు మండలాలను గుర్తించి, కేంద్రానికి నివేదిక పంపాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రుణాలు రద్దు చేయాలని, పంట నష్టం అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

జగన్‌వి కక్ష సాధింపు చర్యలు

సిఎం వైఎస్ జగన్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని లోకేష్ విమర్శించారు. మద్యపాన నిషేధం పేరుతో రూ.లక్ష కోట్ల ప్రజాధనం లూటీ చేసిన జగన్.. చంద్రబాబుపై కేసు పెట్టడం వింతగా ఉందని ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ తెచ్చిన మద్యం మందుకు 35లక్షలమంది వివిధ రోగాల బారిన పడ్డారని, 30వేలమంది ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. ఆరోగ్యం పాడైన ప్రతి ఒక్కరూ కేసు పెడితే 35 లక్షల కేసులు అవుతాయని అన్నారు. టిడిపి హయాంలో ఎక్సైజ్ శాఖలో అక్రమాలు జరిగితే నాలుగున్నరేళ్లపాటు జగన్ ఎందుకు మౌనంగా ఉన్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు మరో ప్రకట నలో ప్రశ్నించారు. దొంగే దొంగ అన్నట్లుగా చంద్రబా బుపై మద్యం పేరుతో అక్రమ కేసు పెట్టారని ఆగ్రహిం చారు. మధ్యంతర బెయిల్‌పై తీర్పు వచ్చే ముందు రోజే కనపడిందా? అని ప్రశ్నించారు. ఇది పక్కా రాజకీయ కుట్ర అని, జగన్ డైవర్షన్ జిత్తులో భాగమే అని విమర్శించారు.

అబద్ధాలు, అసత్యాల యాత్ర : టిడిపి నేతలు

ప్రభుత్వం తరపున మంత్రులు, వైసిపి నేతలు చేస్తుంది సామాజిక సాధికార బస్సు యాత్ర కాదని, అబద్ధాలు, అసత్యాలు యాత్ర అని టిడిపి నేతలు కొల్లు రవీంద్ర, వర్ల రామయ్య, నసీర్ అహ్మద్, ధారునాయక్ విమర్శించారు. మొక్కుబడిగా కొనసాగిస్తూ మంత్రులు చేతులు దులుపుకుంటున్నారని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు ఉండే ప్రాంతాల్లో యాత్ర బస్సుల్ని నిలిపే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. వ్యవస్థల్ని వైఎస్ జగన్ మేనేజ్ చేస్తూ పదేళ్లుగా బెయిల్‌పై బయట తిరుగుతున్నారని టిడిపి నేత బోండా ఉమామహేశ్వరరావు మరో సమావేశంలో విమర్శించారు. పేదల ఇళ్ల స్థలాల ముసుగులో ముఖ్యమంత్రి అండతో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రూ.వెయ్యి కోట్లు కాజేశారని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ విమర్శించారు. అనకాపల్లి నియోజకవర్గంలో 1,300 ఎకరాలకు పైగా రైతుల భూములు బలవంతంగా లాక్కున్నారని ఆరోపించారు.

తప్పు చేయలేదనుకుంటే చట్టపరంగా గెలవండి: సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అవినీతి, అక్రమాల కేసులో అరెస్టు అయి జైలులో వున్న చంద్రబాబు కోసం టిడిపి చట్టపరంగా కోర్టులో పోరాటం చేయకుండా రోజూ డ్రామాలు వేయడం ఏమిటని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. లేని సానుభూతిని సృష్టించుకునేందుకు రోజుకో వేషంతో టిడిపి డ్రామాలు ఆడుతుందని విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సానుభూతి కోసమే నారా లోకేష్‌ను పక్కనబెట్టి ఇప్పుడు నారా భువనేశ్వరిని రంగంలోకి దింపారని విమర్శించారు. ప్రాథమిక ఆధారాలున్నాయి కాబట్టే కోర్టు రిమాండ్‌కు పంపిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టినప్పుడు తాము న్యాయపరంగానే పోరాడామని తెలిపారు. వేర్వేరు కారణాలతో చనిపోయినా.. వారందరూ చంద్రబాబు కోసమే మృతి చెందినట్లు టిడిపి ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. మ్యూజికల్ ఈవెంటుకు రిహార్సల్ చేసినట్లు టిడిపి భాగస్వాములంతా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి మైదానంలో ప్రదర్శన చేశారని విమర్శించారు.

పాలస్తీనాకు పెద్దయెత్తున సంఘీభావం

- ఐరాసలో మోడీ ప్రభుత్వ వైఖరికి ఖండన
- ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలి
- నవంబరు 26-28 దేశవ్యాపిత కిసాన్-మజ్దూర్ మహాపడావ్‌కు మద్దతు
- డిసెంబరు 4న దళిత సంఘాల పార్లమెంట్ మార్చ్‌కు మద్దతు

సిపిఎం కేంద్ర కమిటీ పిలుపు

న్యూఢిల్లీ : మారణహోమంతో కూడిన ఇజ్రాయిల్ దురాక్రమణకు వ్యతిరేకంగా, మాతృభూమి కోసం పాలస్తీనా ప్రజలు సాగిస్తున్న పోరాటానికి పెద్దయెత్తున సంఘీభావం తెలపాలని ఈ నెల 27, 29 తేదీల్లో న్యూఢిల్లీలో సమావేశమైన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ పార్టీ తన శాఖలన్నింటికీ పిలుపునిచ్చింది. విద్యుత్తును ప్రైవేటీకరించేందుకు విద్యుత్ వినియోగదారులకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న యత్నాలను తిప్పికొట్టాలని కూడా కేంద్ర కమిటీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. నవంబరు 26-28 తేదీల మధ్య జరపతలపెట్టనున్న దేశవ్యాపిత కిసాన్- మజ్దూర్ మహాపడావ్‌కు కేంద్ర కమిటీ తన పూర్తి మద్దతు ప్రకటించింది. అలాగే డిసెంబరు4న దళిత సంఘాలు, వేదికలు పార్లమెంటు మార్చ్‌కు ఇచ్చిన పిలుపునకు అది తన మద్దతు ప్రకటించింది. ఎన్నికలు జరుగుతున్న అయిదు రాష్ట్రాల్లో పరిస్థితులపై చర్చించింది. కేంద్ర కమిటీ సమావేశ నిర్ణయాలను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సోమవారం నాడిక్కడ ప్రకటన రూపంలో విడుదలజేశారు. ఆ వివరాలు...

కేరళలో బాంబు పేలుడు

ఎర్నాకులంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో చోటు చేసుకున్న బాంబు పేలుళ్లను కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ పేలుళ్లలో ముగ్గురు మరణించగా, పలువురు గాయపడ్డారు. రాష్ట్ర పోలీసులు ఒక అనుమానితుడిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. వాస్తవాలు నిర్ధారించకుండా, కేరళకు, కేరళ రాష్ట్ర ప్రజలకు వ్యతిరేకంగా కేంద్ర మంత్రి సోషల్ మీడియాలో మతోన్మాద వ్యాఖ్యలు చేయడాన్ని కేంద్ర కమిటీ ఖండించింది. కేరళకు గల విశిష్టమైన, అసమానమైన సామాజిక, మత సామరస్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్న శక్తులపై గట్టిగా గళం వినిపించాల్సిందిగా కేరళ రాష్ట్ర ప్రజలకు కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది.

మణిపూర్

మణిపూర్‌లో పరిస్థితి అంతకంతకూ దిగజారుతునే వుంది. అక్కడ పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కొనడంలో మోడీ ప్రభుత్వం, బిజెపి డబుల్ ఇంజను ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయని దీంతో స్పష్టమవుతోంది. రాష్ట్రంలో జాతుల మధ్య చోటు చేసుకుంటున్న చీలికలు, విభేదాలకు మతం రంగు పులుముతున్నారు.

అధికారికంగా, మృతుల సంఖ్య 175గా రాష్ట్ర పోలీసులు ప్రకటించారు. (వాస్తవానికి, ఈ సంఖ్య ఇంకా ఎక్కువ వుంటుంది) 96మంది మృతదేహాలను ఇంకా గుర్తించాల్సి వుందని చెబుతున్నారు. మరో 32మంది గల్లంతైనట్లు అధికారికంగా ప్రకటించారు. 4,786 ఇళ్ళు, 386 మతపరమైన స్థలాలతో సహా మొత్తంగా 5,172 గృహ దహనాల కేసులు నమోదైనట్లు అధికారిక రికార్డులు పేర్కొంటున్నాయి. 5,668 ఆయుధాలు లూటీ అవగా, కేవలం 1329ని మాత్రమే స్వాధీనం చేసుకో గలిగారు. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను తక్షణమే పదవి నుండి తొలగించి, మణిపూర్‌లో కల్లోలాన్ని అరికట్టాలి.

అసెంబ్లీ ఎన్నికలు

అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో నాల్గింటిలో పరిస్థితులను కేంద్ర కమిటీ చర్చించింది. రాజస్థాన్‌లో రాష్ట్ర కమిటీ ప్రతిపాదించిన 17మంది అభ్యర్ధుల జాబితాను కేంద్ర కమిటీ ధ్రువీకరించింది. ఈ జాబితాలో ఇద్దరు సిట్టింగ్ సిపిఎం ఎమ్మెల్యేలు వున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో పార్టీ మూడు సీట్లలో పోటీచేయనుంది. మధ్యప్రదేశ్‌లో నాలుగు సీట్లలో పోటీ చేస్తోంది. తెలంగాణాలో ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి.

ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాలు

మోడీ ప్రచార యంత్రాంగం సాగిస్తున్న తప్పుడు ప్రచార బుడగ పేలిపోయింది , అడ్డు అదుపు లేని ధరల పెరుగుదల, అంతులేని నిరుద్యోగం వెరసి ప్రజల ఆదాయాలు తీవ్రంగా క్షీణించడానికి దారి తీశాయి. కుటుంబ ఆర్థిక ఆస్తులు 2020-21లో జిడిపిలో 11.5శాతంగా వుండగా, 2022-23 నాటికి వచ్చేసరికి 5.1శాతానికి పడిపోయాయి. ఇది కుటుంబాల రుణ భారంలో తీవ్ర పెరుగుదలకు దారి తీస్తోంది.

ఉల్లి ధరలు ఆకాశాన్నంటుతుండడం, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధుల కోత గ్రామీణ దుస్థితికి దారి తీస్తోంది. అంతర్జాతీయ ఆకలి సూచీలో భారత్ స్థానం 125 దేశాల్లో 111 కనిష్ట స్థాయికి పడిపోయింది.

కుల గణన

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న 2021 సాధారణ జనాభా లెక్కలతో పాటు ప్రజల సామాజిక, ఆర్థిక ప్రతిపత్తులను కూడా మదింపు వేసేలా కుల గణన నిర్వహించాలని కేంద్ర కమిటీ మోడీ ప్రభుత్వాన్ని కోరింది. రిజర్వేషన్లతో పాటు చట్టపరమైన హక్కులు అర్హులైన వారందరికీ అందేలా చూడాలంటే ఇటువంటి కుల గణన చాలా అవసరం.

బీహార్‌లో రాష్ట్ర స్థాయి కుల సర్వే నిర్వహించారు. మరికొన్ని రాష్ట్రాలు కూడా ఈ పని చేయనున్నట్టు ప్రకటించాయి. రాష్ట్ర స్థాయి సర్వేలు నిర్వహించడంపై నిర్ణయమనేది ఆయా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల విశేషాధికారం. అయితే, అఖిల భారత కుల గణనకు ఇది ఎంత మాత్రమూ ప్రత్యామ్నాయం కాజాలదు. ప్రజల అర్హతలను నిర్ధారించడానికి ఈ కుల గణన అనేది ముఖ్యమైన ప్రాతిపదిక.

కేంద్ర కమిటీ పిలుపు

- మాతృభూమి కోసం, ఇజ్రాయిల్ మారణకాండతో కూడిన దురాక్రమణకు వ్యతిరేకంగా పాలస్తీనియన్లు జరుపుతున్న పోరాటానికి సంఘీభావ కార్యక్రమాలను ఉధృతం చేయాలని పార్టీ శాఖలన్నింటికీ కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది.
- విద్యుత్‌ను ప్రైవేటీకరించేందుకు గాను విద్యుత్ వినియోగదారులకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించే యత్నాలను మోడీ ప్రభుత్వం చేస్తోంది. ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు గరిష్ఠ లాభాలు చేకూర్చిపెట్టేందుకు విద్యుదుత్పత్తి అప్పగించడం వల్ల, వాటి రేట్లు బాగా పెరిగిపోయి ప్రజలపై విపరీతమైన భారాలు పడతాయి. ముఖ్యంగా నిరుపేదలు, రైతులపై భరించలేనంతగా భారాలు మోపబడతాయి. ఎక్కడైతే ఈ మీటర్లను పెడుతున్నారో అక్కడ వాటి ఏర్పాటును అడ్డుకునేందుకు నిరసన కార్యాచరణ చేపట్టాలి.
- నవంబరు 26-28 మధ్య దేశవ్యాప్తంగా నిర్వహించనున్న కిసాన్-మజ్దూర్ మహాపడావ్‌కు పార్టీ మద్దతునివ్వాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది.
- డిసెంబరు 4న దళిత సంఘాలు, దళిత వేదికలు ఇచ్చిన పిలుపు మేరకు పార్లమెంట్ మార్చ్ జయప్రదానికి తోడ్పాటును, సంఘీభావాన్ని ప్రకటించాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది.

పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ మారణహోమం

మానవతా రీతిలో స్పందించి కాల్పుల విరమణ పాటించాలని, పౌరులందరికీ రక్షణ కల్పించి, వారికి తక్షణమే మానవతా సాయం అందించాలని కోరుతూ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో తెచ్చిన తీర్మానంపై ఓటింగ్‌లో పాల్గొనడానికి మోడీ ప్రభుత్వం మొండిగా తిరస్కరించడాన్ని కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. మోడీ ప్రభుత్వం ఓటింగ్‌కు గైర్హాజరై, సామ్రాజ్యవాద యుద్ధోన్మాదులతో జతగట్టడం, ఇంతకాలం పాలస్తీనావాదానికి మద్దతు ఇస్తూ వస్తున్న భారత దేశ చరిత్ర, సంప్రదాయాలకు విరుద్ధం. ఐక్యరాజ్య సమితి తీర్మానం చేసిన డిమాండ్‌కు కేంద్ర కమిటీ మద్దతుగా నిలుస్తుందని, అలాగే అన్ని అంతర్జాతీయ చట్టాలను దారుణంగా ఉల్లంఘిస్తూ ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండకు వ్యతిరేకంగా బాధిత పాలస్తీనియన్లు చేస్తున్న పోరాటానికి కేంద్ర కమిటీ తన సంఘీభావాన్ని ప్రకటించింది. ఇప్పటివరకు అధికారికంగా, 8వేల మంది మరణించారు. ఇందులో 4000మంది చిన్నారులే, రోజు రోజుకీ మృతుల సంఖ్య పెరుగుతోంది. గాజాలోనే కాకుండా వెస్ట్ బ్యాంక్‌లో కూడా మరణాలు సంభవిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. తక్షణమే ఇజ్రాయిల్ కాల్పుల విరమణను ప్రకటించాలని, 1967కి ముందున్న సరిహద్దులతో తూర్పు జెరూసలెం రాజధానిగా స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు సంబంధించి ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన రెండు దేశాల పరిష్కారాన్ని అమలు చేయాలని ఒత్తిడి తెస్తూ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ప్రజా నిరసనలు, ఆందోళనల్లో సిపిఎం కూడా పాలుపంచుకుంటుందని తెలిపింది.

ఒక దేశం- ఒక ఎన్నిక

ఒక దేశం ఒక ఎన్నిక ప్రతిపాదన అమలును పరిశీలించేందుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఇప్పుడు రాజకీయపార్టీల అభిప్రాయాన్ని కోరుతోంది. కొద్ది మాసాల తర్వాత జరగబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో వుంచుకుని వచ్చే ఏడాది జనవరి 18కల్లా రాతపూర్వకంగా రాజకీయ పార్టీల వైఖరిని తెలియచేయాల్సిందిగా కోరింది. ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ కేంద్ర కమిటీ స్పష్టమైన వైఖరి తీసుకుంది. ఈ ప్రతిపాదన మన రాజ్యాంగంలో రూపొందించిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదంపై జంట దాడులకు దిగడమేనని పేర్కొంది. లోక్‌సభ ఎన్నికలతో బాటు కలిపి ఒకేసారి జరిపేలా రాజ్యాంగానికి ముఖ్యమైన సవరణలు చేయడంతో బాటు తీసుకొచ్చే ఈ ప్రతిపాదన రాష్ట్రాల అసెంబ్లీల ఆయుష్షును కుదించడం లేదా పొడిగించడమే అవుతుంది. సభలో మెజారిటీని ప్రభుత్వం కోల్పోయినపుడు దాన్ని కొనసాగించడం చట్టవిరుద్ధం. కేంద్ర పాలన విధిస్తే, ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ప్రజలకు గల హక్కును నిరాకరించడమంటే ప్రజాస్వామ్య విరుద్ధమే.

పార్టీల పొత్తులను నియంత్రించలేం

- 'ఇండియా' కూటమి పేరుపై కేంద్ర ఎన్నికల సంఘం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజకీయ పార్టీల పొత్తులను నియంత్రించేందుకు ఎన్నికల కమిషన్‌కు ఎలాంటి చట్టపరమైన అధికారం లేదని ఇసిఐ వెల్లడించింది. ప్రతిపక్ష పార్టీల కూటమికి 'ఇండియా' అని పేరు పెట్టడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఇసి తమ అభిప్రాయాన్ని వెల్లడించింది. అయితే, 'ఇండియా' పేరు చట్టబద్ధతపై తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయడం లేదని స్పష్టం చేసింది. వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఉమ్మడిగా ఎదుర్కొనే వ్యూహంతో 26 ప్రతిపక్ష రాజకీయ పార్టీలు 'ఇండియా' కూటమిగా ఏర్పడిన విషయం తెలిసిందే. అయితే, ఈ పేరును సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కొన్ని పార్టీలు తమ వేదికకు 'ఇండియా' పేరును వినియోగించకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ గిరీష్ భరద్వాజ్ న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు.. ఈ పిటిషన్‌పై తమ స్పందన తెలియజేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఇసి సోమవారం కోర్టుకు తమ స్పందన తెలియజేసింది. 'ఎన్నికలను నిర్వహించడం, రాజకీయ పార్టీలను రిజిస్టర్ చేసుకునే అధికారం ఇసికి ఉంది. కానీ, రాజకీయ పొత్తులను ప్రజాప్రాతినిధ్య చట్టం, భారత రాజ్యాంగం కింద 'నియంత్రిత సంస్థ'లుగా గుర్తించలేదు. గతంలో కేరళ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం 1951 ప్రజాప్రాతినిధ్య చట్టం కింద రాజకీయ కూటములను చట్టపరమైన సంస్థలుగా పరిగణించలేం. అందువల్ల వాటి పనితీరును నియంత్రించేందుకు చట్టబద్ధమైన నిబంధన ఏదీ లేదు' అని ఇసి అభిప్రాయాన్ని వెల్లడించింది.

అనుమానాస్పద స్థితిలో డాక్టర్ మృతి

ప్రజాశక్తి - గుంటూరు సిటీ

గుంటూరులోని ఓ వైద్యుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సురక్ష ఆస్పత్రిలో ఫిజియోథెరఫీ వైద్యుడిగా పనిచేస్తున్న ఎస్.సీతారామాంజనేయులు (35) అలియాస్ సీతారాం తన ఇంట్లోనే మృతి చెందారు. నాలుగు నెలల క్రితం స్వాతిరెడ్డి అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నారు. భార్యను ఉన్నత చదువుల కోసం అమెరికాకు పంపారు. మృతుని తండ్రి రామాంజనేయులు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిజిహెచ్‌కు తరలించారు. ప్రేమ వివాహం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు.

బిజెపి కుట్రలకు చంద్రబాబు అరెస్టే నిదర్శనం

తెలంగాణా కాంగ్రెస్ సిఎల్‌పి నేత భట్టి

ప్రజాశక్తి-గన్నవరం : ప్రతిపక్ష నేతలపై బిజెపి అనేక కుట్రలు చేస్తోందని, చంద్రబాబు అరెస్టే ఇందుకు నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ సిపిఎల్ నేత భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ఆయన హైదరాబాదు నుండి విజయవాడ విమానాశ్రయానికి వచ్చారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు అరెస్టుపై స్పందించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం విజయవాడ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో కాంగ్రెస్ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు.

ధరల స్థిరీకరణ నిధిపై సిఎం సమాధానం చెప్పాలి : పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ధరల స్థిరీకరణ నిధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి డిమాండ్ చేశారు. జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో ధరల స్థిరీకరణ, రైతాంగానికి అవసరమైన శీతల గిడ్డంగులను నిర్మిస్తామని ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదని ఆమె ప్రశ్నించారు. విజయవాడలోని రామవరప్పాడు వెన్యూ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులుగా చిగురుపాటి కుమారస్వామి సహా రాష్ట్ర కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమానికి బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్ తదితరులు హాజరయ్యారు.

రాజకీయ పార్టీల విరాళాల గురించి తెలుసుకునే హక్కు ప్రజలకు లేదు

- 'సుప్రీం'లో కేంద్రం తరపున అటార్నీ జనరల్ వెంకట రమణి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చేందుకు ఉద్దేశించిన ఎన్నికల బాండ్ల పథకాన్ని కేంద్రప్రభుత్వం సమర్థించుకుంది. ఈ పథకం ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని పేర్కొంది. రాజకీయ పార్టీలకు స్వచ్ఛమైన ధనం విరాళంగా అందించాలనే ఉద్దేశంతోనే ఈ పథకం తీసుకొచ్చామని తెలిపింది. ఆ విరాళాలు ఎక్కడి నుంచి వచ్చాయో తెలుసుకునే హక్కు ప్రజలకు లేదని పేర్కొంది. ఈ మేరకు సోమవారం కేంద్రం తరపున అటార్నీ జనరల్ ఆర్ వెంకట రమణి సుప్రీంకోర్టుకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. ఎన్నికల బాండ్ల పథకం ద్వారా రాజకీయ పార్టీలకు వస్తున్న విరాళాల్లో పారదర్శకత ఉండటం లేదని, ఆశ్రిత పెట్టుబడిదారుల నుంచి పాలక పార్టీలు లబ్ధిపొందుతున్నాయని, ఈ పథకాన్ని రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై మంగళవారం సిజెఐ డివై చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ జెబి పార్దీవాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రాతో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తుది విచారణ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో తాజాగా కేంద్రం తన వాదనలను లిఖితపూర్వకంగా కోర్టుకు తెలియజేసింది. ఎలక్టోరల్ బాండ్ల పథకం 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2) పరిధిలో ఉంది' అని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం.. అభ్యర్థుల పూర్వాపరాలను తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందని, అయితే.. ప్రతిదీ తెలుసుకునే హక్కు వారికి లేదని అటార్నీ జనరల్ వాదించారు. ఎన్నికల బాండ్ల సమాచారం పబ్లిక్ డొమైన్లలో ఉండదని, రాజకీయ పార్టీలకు విరాళాలు ఎక్కడి నుంచి వస్తున్నాయో సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకునే హక్కు ప్రజలకు లేదని అన్నారు. ఈ పథకం కింద విరాళాలు ఇచ్చేవారి వివరాలు చాలా గోప్యంగా ఉంటాయని, పన్ను బాధ్యతలను కూడా సక్రమంగా నెరవేర్చేలా చేస్తుందని చెప్పారు.

మోడీ సర్కారు విధానాలకు వ్యతిరేకంగా ఇంటింటి ప్రచారం

- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- సామాజిక భద్రత కల్పించాలి
- రెగ్యులరైజేషన్ చేయాలి
- సంఘర్ష్ ర్యాలీలో కదం తొక్కిన ఆశాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ఆశా సంఘర్ష్ ర్యాలీకి హాజరైన ఆశాలు, (ఇన్‌సెట్) సభలో మాట్లాడుతున్న తపన్‌సేన్

ఉమ్మడి పోరాటాలకు సిద్ధం కావాలని ఆశా వర్కర్స్, ఫెసిలిటేటర్లకు సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ పిలుపునిచ్చారు. ఆశాలను రెగ్యులరైజేషన్, కనీస వేతనం నెలకు రూ.26 వేలు, ఆశా వర్కర్లు, ఫెసిలిటేటర్లకు సామాజిక భద్రత, పెన్షన్, అందరికీ ఆరోగ్యం డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్స్ అండ్ ఫెసిలిటేటర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద ఆశా సంఘర్ష్ ర్యాలీ జరిగింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన ఆశాలు దేశ రాజధాని హస్తినలో కదంతొక్కారు. ఆయా రాష్ట్రాల ప్రాంతీయ భాషల్లో డిమాండ్లతో కూడిన ప్లకార్డులను చేబూని గర్జించారు. 'మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలి. 2023 నవంబరు 26 నుంచి 28 వరకు రాష్ట్రాల రాజధానుల్లో జరిగే మజ్దూర్ కిసాన్ మహాపడవ్‌లో భాగస్వామ్యం కావాలి' అంటూ సంఘర్ష్ ర్యాలీ పిలుపు ఇచ్చింది.

'ఆశా సంఘర్ష్ ర్యాలీ'ని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో అద్భుతమైన పోరాటాలు చేస్తున్న ఆశా వర్కర్లను అభినందిస్తూ, జాతీయ స్థాయిలో పోరాటాలను ఉధృతం చేయాలని, కార్పొరేట్, మత సంబంధమైన ఈ ప్రభుత్వ దేశ వ్యతిరేక విధానాలను మార్చేందుకు ఉమ్మడి పోరాటాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలపై భారాలు మోపుతున్న మోడీ సర్కారు.. కార్పొరేట్లకు లక్షల కోట్ల రాయితీలను ఇస్తుందని విమర్శించారు. స్కీమ్ వర్కర్లకు న్యాయంగా అందాల్సిన సౌకర్యాలు అందడం లేదని అన్నారు. మరోవైపు స్కీమ్‌లను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతుందని విమర్శించారు. కిందస్థాయి సేవల్లో ఆశాలు కీలకపాత్ర పోషిస్తున్నారని, కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించడం లేదని అన్నారు. వారి హక్కులను కాలరాసే విధానాల రూపకల్పన, అమలు చేస్తున్నారని విమర్శించారు. వీటినన్నిటినీ తిప్పికొట్టేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఎడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ అధ్యక్షురాలు పిపి ప్రేమ అధ్యక్షోపన్యాసం చేశారు. ఆశాలను మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ఆశాలతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని, కానీ వాళ్ల ప్రయోజనాల కల్పనలో వెనుకడుగు వేస్తున్నారని విమర్శించారు. ఎడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మధుమిత బందోపాధ్యాయ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సమాఖ్య చేసిన పోరాటాలు, సాధించిన డిమాండ్ల సమస్యలు వివరించారు. పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ ర్యాలీలో ప్రజా సంఘాల నాయకులు పి కృష్ణప్రసాద్ (ఎఐకెఎస్), బి వెంకట్ (ఎఐఎడబ్ల్యుయు), హన్నన్ మొల్లా (ఎస్‌కెఎం-ఎఐకెఎస్), సవిత (ఐద్వా) ప్రసంగించారు. ఆశాల పోరాటానికి సంఘీభావం, మద్దతు తెలిపారు. జై భగవాన్ (ఎండిఎండబ్ల్యూఎఫ్ఐ), ఉషారాణి (ఎఐఎఫ్ఎడబ్ల్యూహెచ్) ఆశా వర్కర్ల పోరాటాలకు సంఘీభావం తెలుపుతూ దేశవ్యాప్తంగా స్కీమ్ వర్కర్ల ఉద్యమాన్ని, ఐక్యతను క్షేత్రస్థాయి వరకు బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జాతీయ కార్యదర్శి ఎఆర్ సింధు స్కీమ్ వర్కర్ల భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. ఎడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ కార్యదర్శి సురేఖ ముగింపు ప్రసంగం చేసి కార్యాచరణ ప్రకటించారు.

కోశాధికారి పుష్ప పాటిల్, పి జయలక్ష్మి (తెలంగాణ), కె ధనలక్ష్మి (ఆంధ్రప్రదేశ్), నోని లిక్సన్ (అస్సాం), సుధా సుమన్ (బీహార్), హసుమతి (గుజరాత్), సునీతా భగత్ (జమ్ము) దిల్‌షాదా (కశ్మీర్), కవితా సోలంకి (మధ్యప్రదేశ్), శకుంతల మహాకుత్ (ఒడిశా), సీమా (పంజాబ్), పుష్ప పాటిల్ (మహారాష్ట్ర) శివ దుబే (ఉత్తరాఖండ్) సంగీత (ఉత్తరప్రదేశ్), సబీనా యాస్మిన్ (పశ్చిమ బెంగాల్) వివిధ రాష్ట్రాల నాయకులు ర్యాలీలో ప్రసంగించారు. అధ్యక్ష వర్గంలో పిపి ప్రేమ, సునీత, కె ధనలక్ష్మి, సుధా సుమన్, ఎటి పద్మనాభన్, వీణా గుప్తా, ఆఫీస్ బేరర్లు మమత (అస్సాం), ప్రియాంక (మహారాష్ట్ర), మధుజ (బెంగాల్), దిలీప్ శుక్లా (యుపి), ఎంబి ప్రభావతి, వివి ప్రసన్నకుమారి (కేరళ) ఉన్నారు.

భవిష్యత్తు కార్యాచరణ

'మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని, 2023 నవంబరు 26-28 తేదీల్లో రాష్ట్ర రాజధానుల్లో జరిగే మజ్దూర్, కిసాన్ మహాపడవ్‌లో పాల్గొనాలని ర్యాలీ పిలుపునిచ్చింది. స్కీమ్ వర్కర్ల సదస్సు పిలుపు మేరకు, డిసెంబరు 2023లో ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలో ఆందోళనకు స్కీమ్ వర్కర్లను భారీగా సమీకరించాలి' అని భవిష్యత్తు కార్యచరణను సంఘర్ష్ ర్యాలీ ప్రకటించింది. అన్ని రాష్ట్రాల నుంచి జనసమీకరణ కోటాను అధిగమించి భారీ జనసమీకరణ మోడీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

దీంతో కలత చెందిన పోలీసులు, పరిపాలన విభాగం సమయానికి ముందే కార్యక్రమాన్ని మూగింపజేసేందుకు ప్రయత్నించారు. దాన్ని ఆశాలు ప్రతిఘటించారు. సంఘర్ష్ ర్యాలీలో 17 రాష్ట్రాల నుండి పదివేల మందికి పైగా ఆశా వర్కర్లు, ఫెసిలిటేటర్లు పాల్గొన్నారు. పంజాబ్‌కు చెందిన రెండు అనుబంధేతర యూనియన్‌లు, యుపి నుంచి ఒక యూనియన్ కూడా ర్యాలీలో పాల్గొన్నాయి. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రాష్ట్రాల్లో పోరాటాల సందర్భంగా రూపొందించిన పాటలు ఆశాలను ఉత్సాహపరిచాయి.

కేరళ ప్రతిష్టను దెబ్బతీసేందుకు విద్వేష మూకల కుతంత్రాలు

- బాధిత కుటుంబాలను పరామర్శించిన అనంతరం సిఎం పినరయి విజయన్

తిరువనంతపురం : కోచిలోని కలామస్సెరి మీటింగ్ హాల్‌లో బాంబు దాడి ఘటనలో గాయపడి కలామస్సెరి మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్న వారిని ముఖ్యమంత్రి పినరయి విజయన్ పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అర్థంపర్థం లేకుండా మాట్లాడుతున్నారని, వారు కక్కుతున్నది మామూలు విషం కాదు, ప్రాణాంతకమైన విషమని అన్నారు.. రాష్ట్రంలో నెలకొన్న లౌకిక, సౌహార్థ వాతావరణాన్ని నాశనం చేయాలన్నదే కేంద్ర మంత్రి వైఖరిగా వుందని విజయన్ విమర్శించారు. దాడి ఘటనపై దర్యాప్తు సక్రమంగా జరుగుతోందన్నారు. ఈ దాడి గురించి ఆదివారమే తాను కేంద్ర హోం మంత్రికి తెలియజేశానన్నారు. రాజీవ్ చంద్రశేఖర్ ఆయన అనుచరుల ప్రకటనలు ఒక ప్రత్యేక వర్గానికి చెందిన వారిని ఉద్దేశించేలా వున్నాయన్నారు. కోచిలోని కలామస్సెరి మీటింగ్ హాల్‌లో బాంబు దాడి ముస్లిం సంస్థల పనే అన్నట్లుగా సంఘపరివార్, బిజెపి సోషల్ మీడియా విద్వేష ప్రచారం చేస్తోందని పినరయి విజయన్ విమర్శించారు. మత ఛాందసవాద శక్తులను అల్లంత దూరాన వుంచడంలో విజయం సాధించిన కేరళ రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసేలా కేంద్ర మంత్రి, పారిశ్రామికవేత్త రాజీవ్ చంద్రశేఖర్, ఇతర బిజెపి నేతలు తప్పుడు ప్రచారాన్ని సాగిస్తున్నారని ఈ పేలుడులో హమాస్ కీలక పాత్ర పోషించిందని పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. బిజెపి మాజీ ప్రతినిధి సందీప్ జి.వేరియర్ మాట్లాడుతూ, యూదులు, క్రైస్తవ సంఘమైన జెహోవా విట్నెసెస్ ఒకే విశ్వాసాన్ని నమ్ముతాయని అంటూ ఈ పేలుళ్లకు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం, హమాస్ తీవ్రవాద కార్యకలాపాలను సమర్థించే సిపిఎం నేతలదేనని అవాకులు చవాకులు పేలుతున్నారని అన్నారు . బాంబు పేలుడుకు పాల్పడిన వారికి హమాస్‌తో సన్నిహిత సంబంధాలున్నాయని బిజెపి మద్దతు గల యూ ట్యూబ్ చానెళ్లు ఆరోపిస్తున్నాయి. ఇజ్రాయిల్‌లో జరుగుతున్న దానికి ఇది ప్రతీకార చర్య అంటూ వ్యాఖ్యానిస్తున్నాయి. కన్వెన్షన్ హాల్లో నాటు బాంబులు పెట్టింది తానేనంటూ జెహోవా విట్నెసెస్ అనుచరుడు డొమినిక్ మార్టిన్ అంగీకరించడంతో విద్వేషాన్ని రెచ్చగొట్టే మూకలు కంగుతిన్నాయి.

సమాజాన్ని అనైక్యతకు గురిచేసే ప్రయత్నాలను నిరోధించాలి : అఖిలపక్ష సమావేశం తీర్మానం


అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న కేరళ సిఎం పినరయి విజయన్

సమాజాన్ని అనైక్యతకు గురిచేసే ప్రయత్నాలను నిరోధించాలని కేరళలో సిఎం విజయన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశం తీర్మానించింది. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం ద్వారా ద్వేషం, భయం వ్యాప్తి చేయడం, వివిధ విశ్వాసాల మధ్య శతృత్వం సృష్టించడమే లక్ష్యంగా కొన్ని శక్తులు పనిచేస్తున్నాయని సిఎం విమర్శించారు. విద్వేష ప్రచారాన్ని ఖండించడంలో ప్రభుత్వంతో కలిసి యుడిఎఫ్ పనిచేస్తుందని ప్రతిపక్ష నేత విడి సతీసన్ మీడియాకు చెప్పారు.



మీ కోసం

మొక్కజొన్న పొత్తులను ఉడికించే నీటితో కొద్దిగా పంచదార వేస్తే చాలా రుచిగా ఉంటాయి.

జీవన సౌరభం

మన స్థాయిని పెంచేది మన ప్రవర్తన తప్ప ఎదుటి వారి పొగడ్త కాదు.

పిచ్చుకలు



పల్లెలలో ప్రతి ఇల్లు
పలకరించే పిచ్చుక గూళ్ళు
వాసాలు వాటి నిజ నివాసాలు
ఇంటిల్లిపాది నేస్తాలు పిచ్చుకలు

ఊర పిచ్చుకల కిచకిచలు
కొక్కొరోకో కోడి కూతలు
ఉషోదయ బంగారు కిరణాలు
ఊరు వాడల మేలుకొలుపులు


రైతు ఇంట ధాన్యపు కంకులు
ఊర పిచ్చుకలకు విందులు
వాకిళ్ల ధాన్యపు ఆరబోతలు
చీడపురుగుల ఏరివేతలు

చిన్ని పాపలున్న ఇల్లు
పిచ్చుకలు చేయు సందళ్లు
పిచ్చుకల స్నానాల చిరుజల్లు
చూసిన మనసు పరవళ్ళు


- పి.బక్కారెడ్డి,
97053 15250.

జత చేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని జంతువులు, వాటికి ఎదురుగా అవి తినే ఆహార పదార్థాలు ఇచ్చాం. క్లూ ఆధారంగా ఏ జంతువు ఏం తింటుందో జత చేయండి చూద్దాం.



నేను గీసిన బొమ్మ





శ్రీమన్నారాయణ,
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
ముత్యాలపేట.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

గ్రంథాలయం ఒక అవసరం..



'గ్రంథాలయం. పుస్తకాల భాండాగారం' అని అందరికీ తెలుసు. కానీ సాంకేతికత అందిపుచ్చుకున్న ప్రస్తుత ఆధునిక యుగంలో అరచేతిలో ప్రపంచం ఆవిష్కరమవుతున్న వేళ, గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదివే తీరిక ఎవరికి వుంటుంది? అని అనుకుంటారు చాలామంది. అయితే తెలంగాణ, నల్గొండ జిల్లా, చిట్యాల మండలం, గుండ్రాంపల్లి గ్రామ యువత మాత్రం అందుకు భిన్నంగా ఆలోచించారు. యువత ఉద్యోగ అవకాశాలు సంపాదించాలంటే గ్రంథాలయాలే పట్టుకొమ్మలని భావించారు. ఆ దిశగా గ్రామంలో సొంత ఖర్చుతో గ్రంథాలయం నిర్వహిస్తున్నారు.



'జీవితంలో ఎదిగేందుకు గ్రంథాలయం ఉపయోగపడుతుంది. ఇది ఆర్భాటం కాదు, అవసరం' అంటారు గ్రంథాలయ నిర్వాహకుడు అనుముల శ్రీనివాస్. ఈ ఒక్క గ్రామంలోనే కాక, జిల్లా వ్యాప్తంగా పలు గ్రంథాలయ స్థాపనలో ఆయన ముందుంటున్నారు. డొనేషన్ల రూపంలో సేకరించి వీటిని నిర్వహిస్తున్నారు. 'సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా పుస్తక పఠనం ద్వారానే విజ్ఞానం వస్తుంది' అంటారు శ్రీనివాస్. దాతలు అందించిన చిన్న గదిలోనే గ్రంథాలయం నిర్వహిస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. వివిధ పుస్తకాలు, పోటీపరీక్షలకు ఉపయోగపడే పత్రికలతో పాటు నిరుద్యోగులకు ఉపయోగపడే 100 నుండి 200 రకాల వార్తా పత్రికలను కూడా అందులో ఉంచుతున్నారు.


ఈ గ్రంథాలయాలకు విశేష స్పందన వస్తోంది. లాక్‌డౌన్ సమయంలో కూడా ప్రజలు వీటిని ఉపయోగించుకున్నారు. 'నేను గ్రూప్ పరీక్షలకు సిద్ధం అవుతున్నాను. ఇక్కడికి వచ్చి నాకు కావాల్సిన అన్ని పేపర్లు, పుస్తకాలు చదువుకుంటాను. ఇవి చాలా ఉపయోగకరంగా ఉంటున్నాయి. పోటీ పరీక్షలకు ఈ గ్రంథాయలం చాలా సహకరిస్తోంది' అంటున్నారు గ్రామానికి చెందిన జి అంజయ్య అనే నిరుద్యోగి.

'నేను ఆటో డ్రైవరుని. పగలంతా ఆటో నడుపుకుంటాను. సాయంత్రం అయ్యేసరికి ఇక్కడికి వచ్చేస్తాను. పుస్తకాలు, వార్తాపత్రికలు, మాసపత్రికలు వంటివన్నీ చదువుతూ ఇక్కడే చాలా సమయం గడుపుతాను. ఇక్కడికి వస్తే నాకు చాలా ప్రశాంతంగా ఉంటుంది' అంటున్నాడు గ్రామానికే చెందిన ఆటోడ్రైవరు వెంకటేశ్వమ్. విజ్ఞానం సముపార్జన కోసం గ్రంథాలయాలు నిర్వహిస్తున్న ఈ గ్రామ యువత ఎంతోమందికి మార్గనిర్దేశకంగా నిలుస్తున్నారు.

బుడతడు భలే ఘటికుడు



ఒక్కోసారి పిల్లలు సాధించే విజయాలు చూస్తే చాలా ఆశ్చర్యమేస్తుంది. చిన్న పిల్లల దగ్గర నుండి పెద్దవాళ్ల వరకు ఫోన్‌కి అతుక్కుపోతున్న ప్రస్తుత కాలంలో ఓ పిల్లవాడు సాధించిన ఘనత ఇప్పుడు అబ్బురపరుస్తోంది. ఫొటోగ్రఫీలో ఆస్కార్‌గా భావించే వరల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్(డబ్ల్యుపివై)కు బెంగుళూరుకు చెందిన పదేళ్ల బుడతడు అర్హత సాధించాడు. లండన్‌లో నిర్వహించే ఈ వేడుకకు అండర్-10 విభాగంలో అవార్డు గెలుచుకున్న ఆ బాలుడి పేరు విహాన్ టాల్యా వికాస్.



వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీలో తండ్రిని ఆదర్శంగా తీసుకున్న విహాన్‌కు ఏడేళ్ల ప్రాయం నుండే ఫొటోగ్రఫీపై మక్కువ ఏర్పడింది. 'నాకు ఈ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉంది. ఫొటోగ్రఫీ అంటే నాకు చాలా ఇష్టం. సృజనాత్మకంగా ఆలోచించడానికి, ప్రకృతితో అనుసంధానం కావడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది' అంటూ తన ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నాడు.

95 దేశాల నుండి 50 వేల చిత్రాలు ఈ పోటీలో పాల్గొన్నాయి. వాటిలో 100 చిత్రాలను ఎంపికచేశారు. 11 విభిన్న కేటగిరీలలో అవార్డులు ప్రకటించారు. అండర్-10 విభాగంలో విహాన్ ఈ అవార్డు అందుకోనున్నాడు. విహాన్ తీసిన చిత్రం డబ్ల్యుపివై59 సేకరణలో భాగంగా వివిధ దేశాల్లో ప్రదర్శిస్తారు. అలా నేచరల్ హిస్టరీ మ్యూజియంలో ఈ చిత్రం వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్ ఎగ్జిబిషన్‌లో చోటు సంపాదించింది. వన్యప్రాణుల రక్షణపై అవగాహన కల్పించేలా ఈ మ్యూజియం 4 ఖండాల్లోని 25 వేదికలపై పోటీకి ఎంపికైన చిత్రాలను ప్రదర్శిస్తుంది.

'విహాన్ తీసిన ఈ చిత్రం కళ, భావన, పరిరక్షణ, సైన్స్ ఉద్దేశ్యాలను వర్ణించేలా ఆవిష్కరించాడు' అంటూ వన్యప్రాణి పరిరక్షణ ఫొటోగ్రాఫర్, పోటీ న్యాయమూర్తి ధృతిమాన్ ముఖర్జీ విహాన్‌ని అభినందిస్తున్నారు. ఇంతకీ విహాన్ తీసిన ఫొటో ఏంటంటే.. నగర శివారులోని ఓ పురాతన రాతి ఫలకంపై చెక్కబడిన కృష్ణ విగ్రహం, దానిపై నిలిచిన అరుదైన జాతికి చెందిన సాలీడుని విహాన్ తన కెమెరాలో బంధించాడు.



పిల్లల ఆరోగ్యంపై ఇలా శ్రద్ధ పెట్టండి..

వాతావరణం మారిన వెంటనే పిల్లలు ఎక్కువగా అనారోగ్యానికి గురౌతుంటారు. వైరల్ జ్వరం, జలుబు-దగ్గు, ఇన్ఫెక్షన్, ఇతర ఇన్ఫెక్షన్లతో బాధపడటం మొదలౌతుంది. పిల్లలలో రోగనిరోధక శక్తి బలహీనంగా ఉండటం వల్లే ఇది జరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు పిల్లల సంరక్షణ, జీవనశైలిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. సరైన ఆహారం, నిద్ర, వ్యాయామం, క్రీడల పట్ల అవగాహన కల్పించాలి.

- ఉదయం వేళ తేలికపాటి వ్యాయామం చేయడాన్ని పిల్లలకు అలవర్చాలి. దీని వల్ల శరీరానికి బలం చేకూరుతుంది. వ్యాధులతో పోరాడడంలో సహాయపడుతుంది.
- చిన్న పిల్లలకు నిద్ర చాలా ముఖ్యం. ముఖ్యంగా 12 ఏళ్లలోపు పిల్లలు కనీసం 9 గంటలు నిద్రపోవాలి. నిద్ర పిల్లల రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది.
- పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్య ఆహారం చాలా ముఖ్యం. పిల్లల ఆహారంలో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, విటమిన్లు, మినరల్స్, ఫైబర్ తగిన మోతాదులో అందాలి.
- పండ్లు, కూరగాయలు, పాలు, పప్పులు, గుడ్లు వంటి పౌష్టికాహారం ద్వారా పిల్లల రోగనిరోధక శక్తి బలపడుతుంది.
- పిల్లలకు ఎల్లప్పుడూ చేతులు కడుక్కోవడం అలవాటు చేయాలి. ఆహారం తినే ముందు తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని నేర్పించాలి.
- చలికాలంలో పిల్లలు స్నానం చేయడానికి వెనకాడతారు. కానీ చలిగా ఉన్నా పిల్లలకు ప్రతిరోజూ గోరువెచ్చని నీటితో స్నానం చేయించాలి. శుభ్రమైన బట్టలు ధరించాలి.

సిగ్నలింగ్ వ్యవస్థ లోపాలు, ఇంజనీర్ల కొరత

రైళ్ల భద్రతకు సవాళ్లు

గాలిలో దీపంలా ప్రయాణికుల ప్రాణాలు

కంటకాపల్లి వద్ద రైలు ప్రమాదానికి లోకో పైలట్ 'సిగ్నల్ ఓవర్ సీ' కారణమా?

2017 నుంచి భద్రతా నిధులకు కోత పెట్టిన మోడీ సర్కారు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశ రైల్వేలో భద్రతా సిబ్బంది కొరత, సిగ్నలింగ్ వ్యవస్థ ఆపరేషన్స్ నిర్వహణ విషయంలో కేంద్రంలోని మోడీ సర్కారు నిర్లక్ష్య వైఖరి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. దీంతో, గడిచిన ఆరేళ్లుగా తూర్పు కోస్తా రైల్వే పరిధిలోని వాల్తేరు డివిజన్‌లో ప్రమాదాలు క్రమేపీ పెరుగుతున్నాయి. భారీ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇక్కడ సుమారు రెండు వేల మంది ఇంజనీరింగ్ సిబ్బంది కొరత ఏళ్ల తరబడి వెంటాడుతోంది. 2013లో విజయనగరం జిల్లా గొట్లాంలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఒక బోగీలో పొగ వచ్చిందని, ఏదో ప్రమాదం జరగబోతుందనే కంగారులో రైలు గొలుసు లాగి పక్కనే మరో రైల్వే ట్రాక్‌లోకి ప్రయాణికులు వెళ్తున్న క్రమంలో ఆ ట్రాక్‌పై వచ్చిన రైలు ఢీకొనడంతో మృతి చెందారు. 2016లో కూనేరులో హీరాకుడ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో 41 మంది మరణించారు. దేశంలోనే అతిపెద్ద రైలు ప్రమాదాల్లో ఒకటైన ఒడిశాలోని బాలాసూర్‌లో ఎదురెదురుగా వచ్చిన రైళ్లు ఢీకొన్న ఘటనలో 298 మంది ప్రాణాలు కోల్పోగా, 500 మందికిపైగా క్షతగాత్రులయ్యారు. తాజాగా వాల్తేరు డివిజన్ పరిధిలోని విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కంటకాపల్లి-అలమండ వద్ద ఆదివారం రాత్రి రాయగడ-విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైలు పలాస పాసింజరును ఢీకొనడంతో సుమారు 13 మంది విగతజీవులయ్యారు. కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ, మోడీ ప్రభుత్వం రైల్వేల భద్రతను పట్టించుకోకపోవడమే ఈ ప్రమాదాలకు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది

కంటకాపల్లి-అలమండ వద్ద జరిగిన రైలు ప్రమాదంపై రైల్వే ఉన్నతాధికారులు ప్రాథమిక విశ్లేషణ ఇలా ఉంది. వాల్తేరు డివిజన్‌లో ప్రధాన, నిత్యం బిజీగా ఉండే రైల్వే లైను ఇది. మూడు రైల్వే లైన్లు ఇక్కడ ఉన్నాయి. మధ్య లైనులో ఈ తాజా ఘటన జరిగింది. హౌరా-చెన్నయ్ వెళ్లే రైళ్లు, కోరమండల్, కోణార్క్ ఎక్స్‌ప్రెస్, మెయిల్, సరుకు రవాణా గూడ్స్ రైళ్లు ఈ లైన్లోనే వెళతాయి. వాల్తేరు రైల్వేలో కీలకమైన మూడు లైన్లు ఇవే అయినప్పటికీ భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఆదివారం ఘటనపై రైల్వే ప్రాథమిక అంచనాలు ఇలా ఉన్నాయి.

సిగ్నల్ వ్యవస్థల్లో రెడ్ (ఎరుపు)-1, గ్రీన్ (ఆకుపచ్చ)-2 సిగ్నల్ లైట్లు ఉంటాయి. పూర్తిగా రెడ్ ఉంటే ఆగడం, గ్రీన్ ఉంటే వెళ్లడం చేయాలి. పసుపు లైట్లు రెండు ఉంటాయి. అవి రెండూ వెలిగితే ప్రొసీడ్ (2 సెక్షన్లు) లైన్లు క్లియర్‌గా ఉన్నాయని అర్థం. కానీ, ఒక పసుపు లైటు వెలిగి ఉంటే ఒక సెక్షన్ క్లియర్ అని, ఆగిఆగి వెళ్లాలని సంకేతం. తాజాగా జరిగిన ప్రమాదంలో రాయగడ రైలు లోకో పైలట్ కాస్త వేగంగా ప్రొసీడ్ అయ్యారని అంచనా వేస్తున్నారు. దీన్నే సిగ్నల్ ఓవర్ సీగా రైల్వే పరిభాషలో పేర్కొంటున్నారు.

సిఆర్ఎస్ ఇన్వెస్టిగేషన్ ప్రారంభం

కంటకాపల్లి ఘటనపై ఇన్వెస్టిగేషన్‌కు కమిషనర్ రైల్వే స్టేఫ్టీ (సిఆర్ఎస్)ను కేంద్రం సోమవారం నియమించింది. ప్రత్యేక సాంకేతిక నిపుణుల బృందం వాల్తేరు డివిజన్‌లో ఈ మేరకు పరిశీలన చేయనుంది. మూడు రోజుల తర్వాత పేపర్ నోటిఫికేషన్ కూడా ఆనవాయితీ ప్రకారం విడుదల చేసి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎవరైనా ఈ ఘటనపై వివరాలు అందజేసేవారుంటే ఫలానా చోట కలవాలని ఈ కమిటీ తెలియపరచనుంది. ప్రజలు, రైల్వే సిబ్బంది, ప్రయాణికులందరినీ ఇలా విచారణ చేశాక పది రోజుల తర్వాత ఈ ప్రమాద కారణాన్ని వెల్లడించనున్నారు.

నానాటికీ తీసికట్టుగా భద్రత

ఈస్ట్ కోస్ట్ రైల్వే, సౌత్ కోస్ట్ రైల్వేల్లో లోకో పైలట్లకు అధిక పని ఒత్తిడి ఉందని కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి ముందే కేంద్రానికి రైల్వే బోర్డు నివేదించింది. ఈస్ట్ కోస్ట్ పరిధిలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ట్రాక్‌లకు ఇరువైపులా పెన్సింగ్ ఏర్పాటు చేయాలని బోర్డు చెప్పినా రైల్వే శాఖకు పట్టలేదు. లోకో పైలట్ల పని 12 గంటలకు మించకుండా ఉండాలని సూచించింది. కానీ, 12 గంటలపైనే వీరితో పని చేయించుకుంటోంది. సదరన్ రైల్వే పరిధిలో 392 లోకో పైలట్ల పోస్టులు ఖాళీలు ఉన్నాయి. 2017 నుంచి 2021 కాలానికి కేంద్ర ప్రభుత్వం భద్రతా నిధి కింద రూ.20 వేల కోట్లు ఏర్పాటు చేయాలి. కానీ, రూ.4 వేల కోట్ల మేరే జమ చేసింది. ఈ విషయంలో కేంద్ర వైఫల్యంపై కాగ్ 2021లో తప్పుపట్టింది.

రేపటి నుంచి ఉత్తరాంధ్రలో భువనేశ్వరి యాత్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు వ్యతిరేకంగా ఆమె భార్య భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి' మలి విడత కార్యక్రమం ఉత్తరాంధ్రలో మూడు రోజుల పాటు జరగనుంది. నవంబర్ 1, 2, 3 తేదీల్లో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఆమె పర్యటించనున్నారు. చంద్రబాబు అరెస్టుతో మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శించనున్నారు. విజయనగరం రైలు ప్రమాద బాధితులను మంగళవారం భువనేశ్వరి పరామర్శించనున్నారు.

ఆఫ్ఘన్ మరో సంచలనం

- ఫారూఖీ మ్యాజిక్ బౌలింగ్
- శ్రీలంకపై ఏడు వికెట్ల తేడాతో గెలుపు

పూణే: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో ఆఫ్ఘనిస్తాన్ జట్టు మరో సంచలనానికి తెరలేపింది. మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఆఫ్ఘన్‌జట్టు శ్రీలంకపై ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టు 49.3ఓవర్లలో 241పరుగులకు ఆలౌట్ కాగా.. ఆ లక్ష్యాన్ని ఆఫ్ఘన్ జట్టు 45.2ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 242పరుగులు చేసి గెలిచింది. తొలుత టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన లంకను ఆఫ్ఘన్ బౌలర్లు కట్టడి చేశారు. ఫజల్లా ఫారూఖీ(4/34) శ్రీలంకను కట్టడి చేయడంలో కీలకపాత్ర పోషించాడు. శ్రీలంక ఓపెనర్ దిముత్ కరుణరత్నె(15) విఫలమైనా.. కెప్టెన్ కుశాల్ మెండిస్(39), పతుమ్ నిస్సంక(46) రెండో వికెట్‌కు 62 పరుగులు జోడించారు. ఈ జోడీని అజ్మతుల్లా విడదీశాడు. నిస్సంక నిష్క్రమించినా కుశాల్.. మిడిలార్డర్ బ్యాటర్ సదీర సమరవిక్రమ(36)లు మూడో వికెట్‌కు 50 పరుగులు జతచేశారు. కానీ ఐదు పరుగుల వ్యవధిలో ఈ ఇద్దరూ నిష్క్రమించడంతో లంక కష్టాల్లో పడింది. మిడిలార్డర్‌లో చరిత్ అసలంక(22), ధనంజయ డిసిల్వ(14)లు పెద్దగా ప్రభావం చూపలేదు. ఏంజెలో మాథ్యూస్(23) చివరిదాకా ఉన్నా అతడు బ్యాట్ ఝుళిపించలేకపోయాడు. లంక లోయరార్డర్ బ్యాటర్ దుష్మంత చమీర(1), మహీశ్ తీక్షణ(29) ఆదుకోవడంతో లంక స్కోరు 200 మార్కు దాటింది. ఆఫ్గాన్ బౌలర్లలో ఫజల్లా ఫరూకీ నాలుగు వికెట్లు తీయగా.. ముజీబ్ ఉర్ రెహ్మాన్‌కు రెండు, రషీద్ ఖాన్, అజ్మతుల్లా ఒమర్జాయ్‌లు తలా ఓ వికెట్ దక్కాయి. ఛేదనలో ఆఫ్ఘన్ ఓపెనర్ గుర్బాజ్(0)డకౌట్ అయినా.. జద్రాన్(39), షా(62) కలిసి 2వ వికెట్‌కు 73పరుగులు జతచేశారు. ఆ తర్వాత కెప్టెన్ షాహిది(58నాటౌట్), అజ్మతుల్లా(73నాటౌట్) కలిసి మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. విజయవానికి ఒక్క పరుగు దూరంలో ఉండగా.. అజ్మతుల్లా ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను లంక ఫీల్డర్ జారవడంతో ఆఫ్ఘన్ విజయం ఖాయమైంది. మధుశంకకు రెండు, రజితకు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఫారూఖీకి లభించింది.



4వ వికెట్‌కు 111పరుగులు జతచేసిన షాహిదీ-అజ్మతుల్లా

స్కోర్‌బోర్డు...

శ్రీలంక ఇన్నింగ్స్: నిస్సంక (సి)గుర్బాజ్ (బి)అజ్మతుల్లా 46, కరుణరత్నే (ఎల్‌బి)ఫారూఖీ 15, కుశాల్ మెండిస్ (సి)నజ్బుల్లా (బి)ముజీబ్ 39, సమర విక్రమ (ఎల్‌బి)ముజీబ్ 36, అసలంక (సి)రషీద్ (బి)ఫారూఖీ 22, డి-సిల్వ (బి)రషీద్ ఖాన్ 14, మాథ్యూస్ (సి)నబి (బి)ఫారూఖీ 23, ఛమీర (రనౌట్) జద్రాన్ 1, తీక్షణ (బి)ఫారూఖీ 29, రజిత (రనౌట్) గుర్బాజ్ 5, మధుశంక (నాటౌట్) 0. **వికెట్ల పతనం:** 1/22, 2/84, 3/134, 4/139, 5/167, 6/180, 7/185, 8/230, 9/239, 10/241 **బౌలింగ్:** ముజీబ్ 10-0-38-2, ఫారూఖీ 10-1-34-4, నవీన్-హక్ 6.3-0-47-0, అజ్మతుల్లా 7-0-37-1, రషీద్ ఖాన్ 10-0-50-1, నబి 6-0-33-0.

ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (బి)మధుశంక 0, జద్రాన్ (సి)కరుణరత్నే (బి)మధుశంక 39, రామత్ షా (సి)కరుణరత్నే (బి)రజిత 62, హస్మతుల్లా షాహిది (నాటౌట్) 58, అజ్మతుల్లా (నాటౌట్) 73, అదనం 10. (45.2ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి) 242పరుగులు.


వికెట్ల పతనం: 1/0, 2/73, 3/131

బౌలింగ్: మధుశంక 9-0-48-2, రజిత 10-0-48-1, మాథ్యూస్ 3-0-18-0, ఛమరీ 9.2-0-51-0, తీక్షణ 10-0-55-0, ధనుంజయ 4-0-21-0

వన్డే ప్రపంచకప్‌లో నేడు..
పాకిస్తాన్ × బంగ్లాదేశ్
(వేదిక: కోల్‌కతా; మ.2.00గం॥లకు)

అనీశ్‌కు ఒలింపిక్స్ బెర్త్


ఛాంగ్వాన్(ద.కొరియా): భారత స్టార్ షూటర్ అనీశ్ భన్వాలా 2024 పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. ఇక్కడ జరుగుతున్న ఆసియా ఛాంపియన్‌షిప్స్ షూటింగ్ పోటీల పురుషుల 25మీ. పిస్టల్ ఫైర్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించి అనీశ్ ఒలింపిక్ బెర్త్‌ను ఖాయం చేసుకున్నాడు. కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకం నెగ్గిన 21ఏళ్ల అనీశ్.. ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన 12వ షూటర్. ఇక 25మీ. పిస్టల్ ఫైర్ ఈవెంట్‌కు ఒలింపిక్ బెర్త్ సాధించిన తొలి ప్లేయర్ కూడాను. ఇక జపాన్‌కు చెందిన దోయ్ యోషికోకు రజతం, కొరియాకు చెందిన లీ గున్‌యోక్‌కు స్వర్ణ పతకం దక్కాయి. 28షాట్ల ఫైనల్లో అనీశ్ 588పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు.



రూబియేల్స్‌పై మూడేళ్ల నిషేధం

ఫిఫా క్రమశిక్షణా కమిటీ

రోమ్: అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) స్పెయిన్ ఫుట్‌బాల్ అసోసియేషన్ మాజీ చీఫ్ లూయిస్ రూబియేల్స్‌పై వేటు వేసింది. రూబియేల్స్ ఫుట్‌బాల్‌కు సంబంధించిన ఎలాంటి కార్యకలాపాల్లో పాల్గొన కూడదంటూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మహిళల ఫిఫా వరల్డ్ కప్-2023 టోర్నీలో స్పెయిన్ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేదికపైనే స్పెయిన్ ఫుట్ బాల్ క్రీడాకారిణి జెన్నీ హెర్మోసోను లూయిస్ రూబియేల్స్ ముద్దు పెట్టు కున్నాడు. ఈ ఘటనను ప్రపంచ సాకర్ బాడీ సీరియస్‌గా తీసుకుంది. లూయిస్ రూబియేల్స్‌పై క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. దాంతో ఈ ఏడాది సెప్టెంబర్‌లో లూయిస్ రూబియేల్స్ స్పెయిన్ ఫుట్‌బాల్ అసోసియేషన్ చీఫ్ పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.



పాయింట్ల పట్టిక

వ.స.	దేశం	ఆ	గె	ఓ	పా	నె.ర.
1.	భారత్	6	6	0	12	+1.40
2.	దక్షిణాఫ్రికా	6	5	1	10	+2.02
3.	న్యూజిలాండ్	6	4	2	8	+1.23
4.	ఆస్ట్రేలియా	6	4	2	8	+0.97
7.	శ్రీలంక	5	2	3	4	-0.20
5.	పాకిస్తాన్	6	2	4	4	-0.38
6.	ఆఫ్ఘనిస్తాన్	5	2	3	4	-0.96
10.	నెదర్లాండ్స్	6	2	4	4	-1.27
9.	బంగ్లాదేశ్	6	1	5	2	-1.33
8.	ఇంగ్లండ్	6	1	5	2	-1.65

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68